TIMES OF VARTHA (04-03-2025)MADKa_times of varha main (13-2).qxd 3/4/2025 6:34 AM Page 1


# టైమ్స్ ఆఫ్ వార్త

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : మంజాల దాసు

తెలంగాణ మంగళవారం, 04 - మార్చి - 2025 సంపుటి : 16 సంచిక : 206 పేజీలు 08 వెల : 6/-


## టీచర్స్ ఎంఎల్‌సిలుగా శ్రీపాల్, కొమురయ్య విజయం

**రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో విజయం సాధించిన నల్లగొండ పిఆర్‌టియు అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి**

**కరీంనగర్‌లో బిజెపి మద్దతు పలికిన కొమురయ్య గెలుపు**

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

ఉపాధ్యాయ కోటా ఎంఎల్‌సి ఎన్నికల ఫలితాలు వెలువడ్డా యి. నల్గొండ -ఖమ్మం -వరంగల్ ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా పింగిలి శ్రీపాల్ రెడ్డి, కరీంనగర్ -మెదక్ -నిజామాబాద్ -ఆదిలాబాద్ టీచర్ ఎంఎల్‌సిగా మల్కకొమురయ్య గెలుపొందారు. న ల్గొండలోని వేర్‌హౌసింగ్ గోదాములో జరిగిన కౌంటింగ్‌లో శ్రీపాల్ రెడ్డి తన ప్రత్యర్థులైన అలుగుబెల్లి నర్సిరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డిపై విజయం సా ధించారు. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఎవరికీ మ్యాజిక్ ఫిగర్ రాలేదు. దీంతో అధికారులు ఎలిమినేషన్ ప్రక్రియ చేపట్టారు. రెండో ప్రాధాన్యత ఓట్లతో సిట్టింగ్ ఎంఎల్‌సి నర్సిరెడ్డిపై శ్రీపాల్ రెడ్డి విజయం సాధించారు. వరంగల్- ఖమ్మం -నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో 24,139 మంది తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు మొదలైన కౌంటింగ్

మిగతా 7లో..





## నీటి వాటాలు తేల్చండి

- కృష్ణా జలాలు న్యాయబద్ధంగా కేటాయించాలి
- గోదావరిలోనూ లెక్క తేల్చాలి
- పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, సమ్మక్క సాగర్ ప్రాజెక్టులకు అనుమతులివ్వండి
- తెలంగాణ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం చేయండి
- కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి

న్యూఢిల్లీ : కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధమైన వాటా కేటాయించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కోరారు. కృష్ణా పరివాహకంలో 70శాతం తెలంగాణలో కేవలం 30 శాతం మాత్రమే ఏపీలో ఉన్నందున కృష్ణా జలాల్లో 70శాతం వాటా తెలంగాణ రాష్ట్రానికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గోదావరికి సంబంధించి తెలంగాణ వాటా నికర జలాలు తేల్చిన తర్వాతే ఏపీ ప్రాజెక్టులపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. సోమవారం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. కృష్ణా, గోదావరి నది జలాలకు సంబంధించి తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి భేటీ వివరాలను వెల్లడించారు. కృష్ణా పరివాహక ప్రాంతం తెలంగాణలో ఎక్కువగా ఉన్నప్పటికీ క ృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) పక్షపాతంగా ఆంధ్రప్రదేశ్‌కు 66, తెలంగాణకు 34 శాతం నీటి కేటాయింపులు చేసిందని అన్నారు. ఏండ్లుగా తాము నష్టపోతున్నామని, ఈ ఏడాది కూడా ఆంధ్రప్రదేశ్ వారికి కేటాయించిన మొత్తానికి మించి నీటిని తరలించుకు పోయిందని తెలిపారు. ఇక ముందు తమ వాటాకు మించి కృష్ణా నది నీటిని ఏపీ తరలించుకోకుండా చూడాలన్నారు. కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు సంబంధించి వెంటనే టెలీ మెట్రీ యంత్రాలు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. అవసరమైతే అందుకయ్యే మొత్తాన్ని తామే భరిస్తామని కేంద్ర మంత్రికి తెలిపినట్టు చెప్పారు.

మిగతా 7లో..

## మీనాక్షి నటరాజన్ అందర్నీ సమన్వయ పరుస్తారా?



- సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో బలంగా ఉంటేనే ప్రభుత్వం?
- మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులకు మీనాక్షి నటరాజన్ దిశా నిర్దేశం చేస్తారా!!
- నాలుగు దశాబ్దాలుగా పార్టీ జెండా మోస్తున్న నాయకులను గుర్తించి వారికి సముద్ర సముచిత స్థానం దక్కేనా!
- సాదా సీదా రాహుల్ గాంధీ టీం మీనాక్షి నటరాజన్ తనదైన శైలిలో కాంగ్రెస్ పార్టీని ఏకతాటిపై తెస్తారా!

టైమ్స్ ఆఫ్ వార్త - ప్రత్యేక ప్రతినిధి ఖాజా భాయ్

నాలుగు దశాబ్దాల అనంతరం తెలంగాణలో అధికారం వచ్చింన కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా బలంగా ఉంటేనే, సుస్థిర ప్రభుత్వాన్ని నడపగలుగుతుందన్న రాహుల్ గాంధీ ఆలోచన. అందుకు అనుగుణంగా తనదైన శైలిలో పార్టీ నాయకత్వాన్ని సంస్థాగతంగా పటిష్టపరిచేందుకు మీనాక్షి నటరాజన్ ఎటువంటి అడుగులు వేస్తారో వేచి చూడాల్సిందేనని సేఫలాజిస్టులో అభిప్రాయపడుతున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇండో జిల్లాకు చెందిన మీనాక్షి నటరాజన్ (51) ఏం ఏస్సి, ఎల్‌ఎల్‌బిలో పట్టాపుచ్చుకున్న విద్యావంతురాలు. 2009లో మంద సౌర్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించింది. ఏ రాష్ట్రంలో నైనా కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా బలంగా ఉంటేనే ప్రభుత్వాలు తమ మనుగడ

మిగతా 7లో..

## 14 మంది మావోల లొంగుబాటు

7లో..



## మార్చి చివరి వారంలో చిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు



- సీఎంతో చర్చించి సమస్య పరిష్కరిస్తాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామీ

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

రాష్ట్రంలోని చిన్న కాంట్రాక్టర్లను ఆదుకుంటామని, పెండింగ్ బిల్లులపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని కాంట్రాక్టర్లకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భరోసానిచ్చారు. సోమవారం బిల్డర్స్ అసోసియేషన్ మాజీ చైర్మన్లు డి.వి.ఎన్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, చిన్న కాంట్రాక్టర్లు కొంతమంది మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించారు. చిన్న కాంట్రాక్టర్లకు సంబంధించి రూ.100 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఏళ్ల తరబడి బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్టు మంత్రికి తెలిపారు. కొత్త పనులు కూడా చేయలేకపోతున్నామని వివరించారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. చిన్న కాంట్రాక్టర్ల బిల్లుల విషయంపై సీఎంతో చర్చించి,

మిగతా 7లో..

## కరోనా కన్నా డేంజరెస్ వైరస్ కాంగ్రెస్ : కెటిఆర్

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్**

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

కరోనా కన్నా డేంజరెస్ వైరస్ కాంగ్రెస్ అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పేర్కొన్నారు. ఏడాది క్రితం చెప్పింది.. ఇవాళ అక్షరాలా నిజమైందని చెప్పారు. తెలంగాణలో జిఎస్‌టి రాబడులు తగ్గడంపై కెటిఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. అసమర్థ సిఎం ఆర్థిక వృద్ధికి గొయ్యితీసి పాతరేశారని, దేశంలోనే అగ్రభాగాన ఉన్న తెలంగాణను ఆఖరికి పడేశారని మండిపడ్డారు. గతేడాది 10 శాతం నమోదైన జిఎస్‌టి వసూళ్లు కేవలం ఒకే ఒక్కశాతం వృద్ధికి పడిపోవడం సిగ్గుచేటు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. చెత్త నిర్ణయాలతోనే తెలంగాణ ఆర్థిక రంగంలో ఈ విధ్వంసం అని, మతిలేని ముఖ్యమంత్రి ఘోర తప్పిదాల వల్లే ఈ సంక్షోభం అని విమర్శించారు. ప్రభుత్వ పెద్దల కమీషన్లు ఆకాశాన్ని అంటుతుంటే..రాష్ట్ర రాబడులు మాత్రం కుప్పకూలడం క్షమించరాని నేరం అని పేర్కొన్నారు. కెసిఆర్ పదేళ్ల స్వర్ణయుగాన్ని చెరిపేసి..



TIMES OF VARTHA (04-03-2025)MADKa_times of varha main (13-2).qxd 3/4/2025 6:34 AM Page 2

since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com



## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

### ప్రజావాణికి 62 ఫిర్యాదులు



**టైమ్స్ ఆఫ్ వార్త – నిజామాబాద్ కలెక్టరేట్**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 62 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీఓ శ్రీనివాస్, నిజామాబాద్ ఏ.సీ.పీ రాజా వెంకట్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళలను మోసం చేస్తే కాంగ్రెస్‌ను మట్టికరిపిస్తాం



- మహిళల ఆగ్రహాన్ని చవి చూడకముందే హామీలు అమలు చేయండి
- హామీలపై ప్రకటన చేయకపోతే సోనియా గాంధీకి లక్షలాది పోస్టు కార్డులు పంపిస్తాం
- మార్చి 8లోపు మహిళలకు ఇచ్చిన హామీలపై ప్రకటన చేయాల్సిందే
- మహిళా లోకంతో ఆటలాడుతున్న రేవంత్ రెడ్డి సర్కారు
- తప్పుడు హామీలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 10 వేల పోస్టు కార్డులు పంపిన ఎమ్మెల్సీ కవిత

**టైమ్స్ ఆఫ్ వార్త – నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా లోకాన్ని మోసం చేయాలని ప్రయత్నం చేస్తే కాంగ్రెస్ పార్టీని మట్టికరిపిస్తామని హెచ్చరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 8వ తేదీలోగా మహిళలకు నెలకు రూ 2500 ఇవ్వడంతో పాటు అన్ని హామీలపై కార్యాచరణ ప్రకటించాల్సిందేనని డిమాండ్ చేశారు. వరంగల్ లో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయానికి రాణి రుద్రమాదేవీ పేరు పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. మహిళలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి సోమవారం ఎమ్మెల్సీ కవిత పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 10 వేల పోస్టు కార్డులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడుతూ... హామీల అమలుపై మార్చి 8 లోగా ప్రకటన చేయకపోతే 10 వేల మంది మహిళలం 10 వేల గ్రామాల్లోకి వెళ్తామని, అన్ని గ్రామాల్లో మహిళలకు కూడగట్టి లక్షలాది పోస్టు కార్డులను తయారు చేసి సోనియా గాంధీకి పంపిస్తామని తేల్చిచెప్పారు. ఏ సోనియా గాంధీ పేరు చెప్పి కాంగ్రెస్ పార్టీ మహిళల ఓట్లు వేయించుకున్నారో అదే సోనియా గాంధీకి లక్షలాది పోస్టు కార్డులను పంపిస్తాం అని స్పష్టం చేశారు.



మహిళలకు విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మానవీయంగా ఆలోచించడం లేదని, మహిళలతో రేవంత్ రెడ్డి సర్కారు ఆటలాడుతోందని, మహిళలను మభ్యపెట్టి మోసం చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ మాట్లాడక ముందే మహిళా బిల్లు కోసం తెలంగాణ జాగృతి ఢిల్లీలో ధర్నా చేసిందని గుర్తు చేశారు. మహిళా బిల్లు రావడంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర లేదని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలుకు కాంగ్రెస్ పార్టీ కేంద్రంపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణకు చెందిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటులో మహిళా అంశాలపై ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. కాగా. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనకు ఆయన ప్రారంభించిన పెట్రోల్ పంప్ కు పోలిక లేదని విమర్శించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన పథకాలు కేవలం పదుల సంఖ్యలో మహిళలకు తప్ప పెద్ద ఎత్తున ప్రయోజనం కలిగే అవకాశం లేదన్నారు. మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లాకు ఒక పెట్రోల్ పంపును ఏర్పాటు చేయిస్తే ఆ జిల్లాలో ఉండే వేలాది మంది మహిళా సంఘాల సభ్యులందరికీ పెద్దగా లాభం ఉండదన్నారు. కాబట్టి మహిళలకు నెలకు రూ. 2500 ఇచ్చే కార్యక్రమాన్ని మొదలు పెట్టాలన్నారు. అప్పుడు ఎక్కువ మంది మహిళలకు ప్రయోజనం కలుగుతుందని వ్యాఖ్యానించారు. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీలు పంపిణీ చేస్తామన్న హామీని అమలు చేయాలని, ఈ పథకాలన్నింటినీ మార్చి 8న ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వడ్డీ లేని రుణాలపై ప్రభుత్వం అందంగా అబద్ధాలు చెబుతోందని ధ్వజమెత్తారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను ఎగ్గొట్టిందని ఆరోపించారు. వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.20 లక్షలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కాబట్టి వడ్డీ రాయితీ బకాయిలు విడుదలతో పాటు రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచాలని, అభయహస్తం నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కిట్ పంపిణీని నిలిపివేసి కాంగ్రెస్ పార్టీ మానవత్వాన్ని మంటకలిపిందని మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలు 20 శాతం పెరిగాయని డీజీపీ వెల్లడించారని, ఆడబిడ్డలకు రక్షణపై ప్రభుత్వం సమీక్షించి ప్రకటన చేయాలని సూచించారు. అదేవిధంగా మహిళా కార్మికులను ప్రత్యేకంగా గుర్తించి అవసరమైన సదుపాయాలు కల్పించడం లేదని, మహిళా కార్మికులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణను ప్రకటించాలని ప్రతిపాదించారు. అంగన్ వాడీ కార్మికుల జీతాలను పెంచుతామని హామీ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని ఆరోపించారు. అంగన్ వాడీ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు ప్రభుత్వం ఢాంబికాలు పలుకుతోందని, కానీ ఆ పోస్టులను కేసీఆర్ హయాంలోనే సృష్టించారని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఆడపిల్లలకు ఫీజు రియింబర్స్ మెంట్ చేయడం లేదని, దదాంతో తల్లిదండ్రులు వారిని చదువు మానిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ అన్ని అంశాలపై దృష్టి పెట్టి సమస్యలను, డిమాండ్లను పరిష్కరించాలని కవిత సూచించారు.

## శ్రీమన్నారాయణకు ఆర్ అండ్ బి శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతి

### ఘనంగా సన్మానించి అభినందించిన టిఎన్జీవోస్



**టైమ్స్ ఆఫ్ వార్త – నిజామాబాద్ సిటీ**

రోడ్డు భవనాల శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయంలో సుదీర్ఘకాలంగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా సేవలందించిన శ్రీమన్నారాయణ నిజామాబాద్ డివిజన్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన శుభ సందర్భంగా శ్రీమన్నారాయణను టిఎన్జీవోస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సత్కరించి ఫ్లవర్ బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాధ్యక్షుడు చిట్టి నారాయణ రెడ్డి, టీఎన్జీవో కేంద్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు అతిక్ అహ్మద్, అర్బన్ యూనిట్ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, సంయుక్త కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో వంద శాతం ఉత్తీర్ణత సాదించాలి...

**టైమ్స్ ఆఫ్ వార్త – ఎడపల్లి**



నూతనంగా ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన శివలింగ్ గాలప్ప ఆధ్వర్యంలో పదవ తరగతిలో ఎడపల్లి మండలం 100శాతం ఉత్తీర్ణత సాధించాలని కుర్నాపల్లి గ్రామానికి చెందిన నాయకులు ఆకాంక్షించారు. ఈ మేరకు ఎడపల్లి మండల నూతన ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన శివలింగ్ గాలప్పను కుర్నాపల్లి గ్రామానికి చెందిన నాయకులు సోమవారం సన్మానించారు. ఎడపల్లి మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓను కలిసిన నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకుడు రవీందర్ గౌడ్ మాట్లాడుతూ...తమ గ్రామంలోని హైస్కూల్ కు గత సంవత్సరం క్రితం హెడ్మాస్టర్ గా బదిలీపై వచ్చి విధులు నిర్వహిస్తున్న గాలప్ప పాఠశాలను, విద్యార్థులను క్రమశిక్షణగా తయారు చేసారని, ఆయన వచ్చిన తరువాతే తమ పాఠశాలలో పదిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందని అన్నారు. ఇప్పుడు తన పాఠశాలకు మాత్రమే కాకుండా మండలంలోని అన్ని పాఠశాలలో 100శాతం ఉత్తీర్ణత సాధించే కృషి చేయాలని కోరారు. అంతే కాకుండా తమ స్వంత పాఠశాలపై కూడా దృష్టి సారించి మండలంలోనే అత్యున్నత శాతం సాధించే విధంగా తీర్చి దిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సావిత్రి రవీందర్ గౌడ్, ముదిరాజ్ సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ కృష్ణ, సొసైటీ చైర్మన్ పరిగే సుమన్ కుమార్, మాజీ మండల్ కోఆప్షన్ మేంబర్ మోబిన్, అల్తాఫ్, తదితరులు పాల్గొన్నారు.

## చెట్టుకు ఉరి వేసుకొని యువకుని ఆత్మహత్య

**టైమ్స్ ఆఫ్ వార్త – ఎడపల్లి / రెంజల్**

మద్యానికి బానిసై, అనారోగ్యతో బాధపడుతూ ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రెంజల్ మండలంలో సోమవారం చోటు చేసుకోంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రెంజల్ మండలంలోని తాడ్ బిలోలికి చెందిన జంగం నవీన్ అనే యువకునికి గత నాలుగు సంవత్సరాల క్రితం అతని భార్య విడిచి వెళ్ళిపోయింది. ఈక్రమంలో భార్య లేదని బాధతో మద్యానికి బానిసై అనారోగ్యం బారిన పడ్డాడని, దీంతో మతి స్థిమితం కోల్పోయాడని తెలిపారు. సోమవారం ఉదయం గ్రామానికి చెందిన ఓవ్యక్తి పొలంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలియడంతో అక్కడ వెళ్ళి చూడగా ఆ వ్యక్తి జంగం నవీన్ గా గుర్తించి అతని సోదరి జంగం శోభ కు తెలిజేయడం జరిగిందన్నారు. దీనిపై మృతుని సోదరి జంగం శోభ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్ట్ మార్టం నిమిత్తం శవాన్ని బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా యూజీసీ గైడ్ లైన్స్

- వర్సిటీల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేసే కుట్రలు
- రాష్ట్రాల హక్కులను కాల రాసే నిర్ణయాలు
- యూజీసీ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా రాష్ట ప్రభుత్వం నిర్ణయం చేయాలి
- తెలంగాణ యూనివర్శిటీ ఏఐఎస్ఎఫ్ కౌన్సిల్ విలేకరుల సమావేశంలో జాతీయ సమితి సభ్యుడు రఘురాం



**టైమ్స్ ఆఫ్ వార్త నిజామాబాద్/డిచ్పల్లి**

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చట్టబద్ధమైన స్వతంత్ర సంస్థను కేంద్రం తన సొంత ఎజెండాను వర్సిటీలలో అమలుపరిచేందుకు కుట్రలు చేస్తుందని, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తూ తీసుకువచ్చిన యూజీసీ నూతన మార్గదర్శకాలు రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని, వెంటనే దీనిని ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు రఘురాం అన్నారు. సోమవారం డిచ్పల్లి లోని తెలంగాణ యూనివర్సిటీ బాయ్స్ హాస్టల్ లో ఏఐఎస్ఎఫ్ తెలంగాణా యూనివర్సిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు రఘురాం మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యా వ్యవస్థను దెబ్బతీసే విధంగా పాలన సాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయాలని కుట్రలు చేస్తూ జాతీయ విద్యా విధానం పేరుతో విద్య కాషాయికరణకు పూనుకున్నారని ఆరోపించారు. సంస్కరణల పేరుతో ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందన్నారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల ఆచార్యుల నియామకాలు, పదోన్నతి కోసం కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాల పరిరక్షణ పేరిట యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) జనవరి 6న ముసాయిదా డ్రాఫ్ట్‌ను విడుదల చేసిందని, విద్యలో కేంద్ర, రాష్ట్రాల అధికారాల విషయంలో రాజ్యాంగంలో స్పష్టంగా ఉన్నప్పటికీ దాని స్ఫూర్తికి విరుద్ధంగా ఈ ముసాయిదా ప్రతిపాదనలు ఉంటూ రాష్ట్రాల హక్కులను, నిర్ణయాధికారాన్ని బలహీన పరుస్తూ మొత్తంగా ఫెడరల్ స్ఫూర్తిని ఉల్లంఘిస్తూ రాజ్యాంగ మూల సూత్రాలకు వ్యతిరేకంగా ఉందని మండిపడ్డారు. పూర్తిగా గవర్నర్ చేతిలో వీసీల నియామకాలు రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ఇప్పటి వరకూ వైస్ ఛాన్సలర్ (వీసీ)ల నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో సెర్చ్ కమిటీ వేస్తూ వస్తోందని, ఈ కమిటీలో ముగ్గురు సభ్యులు యూజీసీ ప్రతినిధి, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదించిన సభ్యుడు, యూనివర్సిటీ కౌన్సిల్ ప్రతినిధి ఉంటున్నారని, ఈ సెర్చ్ కమిటీ సీనియారిటీ, అర్హతలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ముగ్గురు పేర్లను సూచిస్తుందన్నారు. ఆ ముగ్గురు పేర్లను రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు పంపుతుందని, ఆ ముగ్గురిలో ఒకరిని గవర్నర్ వీసీగా ఎంపిక చేస్తారు... కానీ ఇప్పుడు యూజిసి 2025 సవరించిన నియమాలు వైస్ ఛాన్సలర్ల ఎంపికలో రాష్ట్ర గవర్నర్లకు ఎక్కువ అధికారాన్ని ఇస్తున్నాయని, ఇది అత్యంత ప్రమాదకరమని ఆరోపించారు. ఈ యూజీసీ ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర యూనివర్సిటీలు రాష్ట్ర అసెంబ్లీ చట్టం ద్వారా ఏర్పాటు చేయబడతాయని రాష్ట్ర ప్రభుత్వమే యూనివర్సిటీలకు నిధులు కేటాయిస్తుందని కానీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్లను నియమించి ఆర్ఎస్ఎస్ భావజాలానికి చెందిన వారిని ప్రొఫెసర్లుగా రిపోర్టు చేయడానికి కుట్రలు చేస్తున్నారని, దీనిని రాష్ట్ర ప్రభుత్వాలు గమనించి వ్యతిరేకించాలన్నారు. యూజీసీ ముసాయిదా ప్రతిపాదనలు ఉన్నత విద్యలో పూర్తిస్థాయి కార్పొరేట్ సంస్కృతిని చొప్పిస్తుందని, ఉపాధ్యాయులకు నిర్దిష్ట బోధన సమయం ప్రస్తావించలేదని, 'నెట్' అవసరం లేకుండా 'మాస్టర్స్ డిగ్రీ' ఉంటే చాలు అంటూ 55 శాతం మార్కులతో మాస్టర్స్ సాధించిన వారిని యూజీసీ %-% నెట్‌లో అర్హత సాధించకపోయినా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నేరుగా నియమించుకోవచ్చని పేర్కొనడం బాధాకరమన్నారు. ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కేంద్రం ఒకొక్కటిగా తన అధీనంలోకి తీసుకుంటూ రాష్ట్రాలపై తన విధానాలను బలవంతంగా రుద్దుతోందని దుయ్యబట్టారు. ఇప్పటికే తమిళనాడు, కేరళ వంటి అనేక ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలలో ప్రభుత్వాలు గవర్నర్‌లతో వీసీల నియామకం పై వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నాయని, ఆ రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకొని కేంద్రంపై, యూజీసీ వత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ యూనివర్సిటీ కన్వీనర్ సాయి, కో కన్వీనర్లు సంజయ్, చందు విజయ్, దినేష్ పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన జాతీయ పసుపు బోర్డు సెక్రెటరీ భవానీ శ్రీ ఐఏఎస్

- పసుపు బోర్డు జాతీయ చైర్మన్ గంగారెడ్డిని కలిసిన సెక్రటరీ
- మనోహరాబాద్, కమ్మర్పల్లి పసుపు పరిశోధన కేంద్రాల సందర్శన
- 600కు పైగా రైతులను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయం
- పసుపు పొడిని ఆసక్తిగా పరిశీలించిన సెక్రటరీ భవాని శ్రీ



**టైమ్స్ ఆఫ్ వార్త – నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**



ఇటీవల జాతీయ పసుపు బోర్డు సెక్రటరీగా నియమించబడిన భవాని ఐఏఎస్ సోమవారం నిజామాబాద్ లోని జాతీయ పసుపు బోర్డు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె పసుపు బోర్డు జాతీయ చైర్మన్ పల్లె గంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. బాధ్యతలు తీసుకున్న వెంటనే జక్రాన్ పల్లి మండలంలోని మనోహరాబాద్‌లో గల జేఎంకేపిఎం రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన పసుపు ఆధారిత పరిశ్రమను బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డితో కలిసి సందర్శించారు. మూడు కోట్ల వ్యయంతో ఆత్మ నిర్భర్ భారత్ పథకంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 600కి పైగా రైతులు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం పరిశ్రమలో తయారుచేసిన పసుపు పౌడర్ ను ఆసక్తిగా పరిశీలించారు. పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల పసుపు రైతులకు మేలు కలగడమే కాకుండా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించే ఆస్కారం ఉందన్నారు. అనంతరం కమ్మర్ పల్లి మండల కేంద్రంలో గల పసుపు పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను శాస్త్రవేత్త మహేందర్ రెడ్డి వివరించారు. వీరి వెంట స్పైసెస్ బోర్డ్ డిప్యూటీ డైరెక్టర్ సుందరేశన్, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

since 2007
# టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com

జనరల్ న్యూస్
GENERAL NEWS


సోమవారం,
03-03-2025



## చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా పటిష్ట చర్యలు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి
- యాసంగి సాగు నీటి సరఫరా, గురుకులాల సందర్శనపై కాన్ఫరెన్స్ సమీక్షించిన సిఎస్
- రాబోయే 10 రోజుల పాటు అధికారులు అప్రమత్తంగా ఉంటూ నీటి సరఫరా పర్యవేక్షించాలని సూచన
- ఎత్తిపోతల పథకాలకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా లోటు రాకుండా చర్యలు తీసుకోవాలి





టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ కలెక్టరేట్

చివరి ఆయకట్టు వరకు పంటలకు సాగు నీరు అందేలా ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. సోమవారం సాయంత్రం ఆమె యాసంగి పంటలకు సాగు నీటి సరఫరా, నీటి పారుదల శాఖ పనితీరు పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. యాసంగి పంటలకు రాబోయే పది రోజులు చాలా కీలకమని, అధికారులు అప్రమత్తంగా ఉంటూ సాగు నీరు, విద్యుత్తు సరఫరా అవసరమైన మేర పంట పొలాలకు చేరేలా చూడాలని, సాగు రంగానికి నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భారీ నీటి పారుదల శాఖ పరిధిలోని రిజర్వాయర్లలో అవసరమైన మేర సాగునీరు అందుబాటులో ఉందని, పంటలకు సమృద్ధిగా నీరు విడుదల చేయడం జరుగుతుందని, విడుదల చేసిన నీరు చివరి ఆయకట్టు వరకు చేరేలా అధికారులు సమర్థవంతమైన పర్యవేక్షణ చేయాలని అన్నారు. యాసంగిలో 77 లక్షల ఎకరాలలో సాగు జరుగుతోందని, ముఖ్యంగా వరి పంట 54.82 లక్షల ఎకరాల సాగు జరిగిందని, గత సంవత్సరం కంటే 2 లక్షల 70 వేల ఎకరాలు వరి, లక్ష ఎకరాల మొక్కజొన్న పంట అధికంగా సాగు అవుతోందని తెలిపారు. సిద్దిపేట, జనగామ, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి, వనపర్తి. తదితర జిల్లాలలో కొన్ని సమస్యలు ఉన్నాయని, వీటిని పక్కగా పర్యవేక్షిస్తూ పంటలు ఎండిపోకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రాజెక్టుల నుంచి విడుదల చేసిన ప్రతి నీటి చుక్కను పూర్తిస్థాయిలో వినియోగించు కుంటూ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ కలెక్టర్లకు సూచించారు.ఎస్సారెస్పీ, ఎస్సారెస్పీ స్టేజి 2,నాగార్జున సాగర్, ఏఎంఆర్ లిఫ్ట్, కల్వకుర్తి, ఇతర ప్రాజెక్టుల కింద నిర్దేశిత ఆయకట్టుకు సాగునీరు అందాలని సీఎస్ సూచించారు. రాబోయే 10 రోజుల్లో క్షేత్రస్థాయి నుంచి వచ్చే డిమాండ్ కు అనుగుణంగా సాగునీరు విడుదల చేస్తూ, రైతుల పొలాలు ఎండిపోకుండా కాపాడాలని సిఎస్ ఆదేశించారు. ఎత్తిపోతల పథకాలకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఎక్కడ లోటు రాకుండా చూసుకోవాలని సీఎస్ డిస్కం అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఉన్న పీక్ డిమాండ్ కు మరో 10 నుంచి 15 శాతం పెరిగినా తట్టుకునేలా విద్యుత్ వ్యవస్థ సన్నద్ధంగా ఉండాలని సీఎస్ సూచించారు. కాగా, రాష్ట్రంలో ఉన్న గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కలెక్టర్, అదనపు కలెక్టర్ ల తనిఖీ తర్వాత పరిస్థితులలో మార్పులు వచ్చాయని, పిల్లలకు అందించే ఆహార నాణ్యత పెరిగిందని, కామన్ మెనూ డైట్ పక్కాగా అమలు అవుతుందని అన్నారు. సింగిల్ యూసెజ్ ప్లాస్టిక్ నిషేధంకు సంబంధించి ప్రజలను భాగస్వామ్యం చేస్తూ, ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేలా చర్యలు తీసుకోవాలని సిఎస్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, వ్యవసాయ, ఇరిగేషన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు

- 27 గోల్డ్ మెడల్స్, 9 సిల్వర్ మెడల్స్, 2 బ్రాంజ్ మెడల్స్
- మెడల్ విన్నర్స్ ను అభినందించిన చైర్మన్ బస్వాపురం లక్ష్మీ నరసయ్య



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ స్పోర్ట్స్

తెలంగాణ రాష్ట్ర స్థాయి తైక్వాండో ఛాంపియన్షిప్‌లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. తెలంగాణ టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో మెరుగైన ఫలితాలు సాధించి జిల్లాకు తిరిగివచ్చారు. గ్రాండ్ మాస్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్ యూసుఫ్ గూడా శ్రీ కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో నిజామాబాద్ జిల్లా ఆమె చూర్ తైక్వాండో అసోసియేషన్ క్రీడాకారులు 27 గోల్డ్ మెడల్స్,9 సిల్వర్ మెడల్స్,2 బ్రాంజ్ మెడల్స్ సాధించడం గర్వ కారణమని నిజామాబాద్ జిల్లా టైక్వాండో అసోసియేషన్ చైర్మన్ బస్వాపురం లక్ష్మీ నరసయ్య సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా విద్యార్థి దశలో ఉన్న క్రీడాకారులు చదువుతోపాటు క్రీడల్లోనూ ముందు వరుసలో ఉండాలని, దీంతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు జాతీయస్థాయి అంతర్జాతీయ స్థాయిలలోనూ మన రాష్ట్ర క్రీడాకారులుగా ప్రాతి నిధ్యం వహించి మెడల్స్ సాధించే దిశగా కృషి చేయాలని కోచ్ మనోజ్ కుమార్ ను అభినందించారు.ఈ కార్య క్రమంలో ప్రెసిడెన్సీ స్కూల్ ప్రిన్సిపల్ పవన్ కుమార్,క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బేస్బాల్ లో మెడల్స్ సాధించిన తొర్లికొండ విద్యార్థులు



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ స్పోర్ట్స్/ తొర్లికొండ

తెలంగాణ రాష్ట్ర స్థాయి సభ్యులు జూనియర్ బేస్బాల్ ఛాంపియన్షిప్ లో నిజామాబాద్ జిల్లాలోని తొర్లికొండ జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు మెడల్స్ సాధించినట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం. గంగ మోహన్ తెలిపారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 2 వరకు సిద్దిపేట్ జిల్లా గజ్వేల్ లో జరిగిన 5వ రాష్ట్ర సబ్ జూనియర్ బేస్ బాల్ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొర్లికొండ విద్యార్థులు బాలికల విభాగంలో జి. సరిత, ఆర్ గంగోత్రి, బీ. మైత్రి, జి. వనజ పాల్గొని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి గోల్డ్ మెడల్ సాధించారు. అదేవిధంగా బాలుర విభాగంలో బి. విష్ణు చైతన్య, డి. మురళి, సిహెచ్ సుశాంత్ కీలకపాత్ర పోషించి కాంస్య పతకాలు అందుకున్నట్లు తెలిపారు.మినీ-జూనియర్ ఎంపికలో కే. కిషోర్, ఎం. సిద్ధార్థ పాల్గొని రాష్ట్ర ప్రబబుల్స్ జట్టుకు ఎంపికైనారన్నారు. ఈ సందర్భంగా మెడల్స్ సాధించి రాష్ట్ర ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జక్రాన్ పల్లి మండల విద్యాధికారి ఎం. శ్రీనివాస్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నాగేంద్ర, ఉపాధ్యక్షుడు స్వామి, గ్రామ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు సాయిలు, రామకృష్ణ,గంగాధర్, డాక్టర్ నరసింహారావు, సునీత, కృష్ణ,మాలతి, పల్లె గంగాధర్, గౌతమి, ఓఎస్ శేఖర్ విజేతలుగా నిలిచి మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందించారు.

## వృత్తి తో పాటు ఉపాధి మార్గాలను ఎంచుకోండి

**ఎమ్ఎస్ఎమ్ఈ స్కీం నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నోడల్ ఆఫీసర్ రాజేష్ కుమార్ యాదవ్**

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ



సెక్స్ వర్కర్లుగా కొనసాగుతున్న వారు దానిపై పూర్తిగా ఆధారపడకుండా ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం అందించే పథకాల ద్వారా ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని ఎం ఎస్ ఎం ఈ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్ కుమార్ యాదవ్ సూచించారు. స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో ఖలీల్వాడిలోని న్యూ అంబేద్కర్ భవన్లో నిర్వహించిన సెక్స్ వర్కర్ల హక్కుల దినోత్సవ కార్యక్రమానికి ఆయన ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వృత్తిలో కొనసాగుతున్న వారు ఒక నిర్దిష్ట వయసు తర్వాత నిరాధారానికి గురవుతారని ఆయన గుర్తు చేశారు. ఆర్థికంగా ఎదుర్కొనే సమస్యలు జీవితాన్ని దుర్భర పరిస్థితిలో తీసుకెళ్లే సందర్భాలు ఉంటాయి అన్నారు. మంచి ఆరోగ్యం ఒక వయసు వరకు మాత్రమే ఈ వృత్తిలో నిలదొక్కుకున్నప్పటికీ ఆ తర్వాత ఎదుర్కొనే సమస్యలు చాలా తీవ్రంగా ఉంటాయి అన్నారు. అది ఆర్థిక పరంగా కానీ ఆరోగ్యపరంగా గాని సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అందుకని నేటి రోజుల్లో సెక్స్ ఎడ్యుకేషన్ చాలా ప్రాముఖ్యమని ఆయన సూచించారు. మన వల్ల ఇతరులకు హాని, అపాయము, ఇబ్బందులు తలపెట్టవద్దని హితువు పలికారు. ఇందులో భాగంగానే ఎం ఎస్ ఎం ఈ స్కీం ద్వారా రూ.5 లక్షల వరకు మైక్రో బిజినెస్ పథకం ద్వారా అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ముద్ర పథకం ద్వారా రూ.5 నుంచి రూ.10 లక్షల వరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోటి రూపాయల వరకు, మ్యానుఫ్యాక్చరింగ్ పథకం కింద రూ.50 లక్షల వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాస్థాయిలో ఇండస్ట్రీ విభాగం ఉంటుందని, ఆ విభాగం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థిక సహాయం పొందవచ్చునని తెలియజేశారు. అంతేకాకుండా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అధికారి సుధాకర్, నిజామాబాద్, అదిలాబాద్ క్లస్టర్ ప్రివెన్షన్ అధికారి మోయిజ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ 95 గురించి తెలియజేశారు. ఈ మిషన్ 95 హెచ్ఐవి ఉందా లేదా అనేది పరీక్షలు చేయడం అలాగే ఉన్నవారు ఎప్పటికప్పుడు మెడిసిన్ తీసుకోవడం, జాగ్రత్తలు పాటించడం, మరొకరికి సోకకుండా భవిష్యత్ తరాలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్స్ట్రక్షన్ కార్యదర్శి డాక్టర్ సూరి సిద్దయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో టార్గెట్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్టు జి ఎన్ ఎంబాలరాజ్, జి ఎన్ ఎం మౌనిక, కౌన్సిలర్ అన్విత, అకౌంట్స్ అధికారి విజయ్ కుమార్, పారా లీగల్ వాలంటరీ వెంకట్, సిబ్బంది తదితరులున్నారు.

## సెక్స్ వర్కర్లు చేసేది తప్పు కాదు.. వారిని వేధించవద్దు

- ఇటీవల సుప్రీంకోర్టు వెల్లడించింది
- స్నేహ సొసైటీ కార్యదర్శి డాక్టర్ సూరి సిద్దయ్య

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ





ఆయా పరిస్థితుల కారణంగా కొందరు మహిళలు సెక్స్ వర్కర్లుగా మారి జీవనోపాధిని కొనసాగిస్తున్నారని, ఈ విషయంలో వారు చేసేది తప్పు కాదని సుప్రీంకోర్టు ఇటీవల చెప్పిందని స్నేహ సొసైటీ కార్యదర్శి డాక్టర్ సూరి సిద్దయ్య అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్లో ఏర్పాటు చేసిన సెక్స్ వర్కర్ల హక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సెక్స్ తప్పు కాదని దాని పేరిట మహిళలను వేధించవద్దని పోలీసులకు స్పష్టమైన విధానంలో తెలిపిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అయితే భారత రాజ్యాంగంలో రాజ్యాంగం కల్పించిన హక్కులు ఉన్నప్పటికీ వారిని పోలీసులు తీసుకెళ్లడం వంటి సందర్భాలు నేటికీ జరుగుతున్నాయి అన్నారు. అటువంటి సందర్భాల్లో స్నేహ సొసైటీ బృందం వెళ్లి వారికి వివరించడం జరిగిందన్నారు. సుప్రీంకోర్టు స్పష్టమైన విధివిధానాలు తెలిపినప్పటికీ ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవడం వెనక అవగాహన లోపమే కారణమని ఆయన చెప్పారు. అయితే ఈ కార్యక్రమం స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వ కార్యక్రమమే అని ఆయన అన్నారు. సెక్స్ వృత్తిలో కొనసాగుతున్న వారు ఆ వృత్తిని మానుకోమని చెప్పడం సరికాదని, కానీ అంతకంటే మంచి వృత్తిని ఎంచుకోవాలని వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ, ముద్ర వంటి ఇతర రుణ సౌకర్యాలు కల్పిస్తూ వారిని ప్రోత్సహించే విధానాలను తీసుకొచ్చిందన్నారు. ఈ పథకాల ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని ఆయన సూచించారు. ఈ విషయంలో స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్నో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ సుమారు 800 మంది సెక్స్ వర్కర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడమే కాకుండా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల వినియోగంపై రుణాల మంజూరిపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆయన వివరించారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి మార్గాలను ఎంచుకుంటూ ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. అనంతరం స్నేహ సొసైటీ బృందం సెక్స్ వర్కర్ల బృందం కృతజ్ఞతా పూర్వకంగా సన్మానించారు.

## రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు దుబ్బ స్కూల్ ఉపాధ్యాయుడు



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ విద్యావిభాగం

రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్ కు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు చల్ల మధుకృష్ణ ఎంపికయ్యాడు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ఎస్సిఈఆర్టి విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ హైద్రాబాద్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరిలో నిర్వహించే ఉపాధ్యాయుల సైన్స్ సెమినార్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా నుంచి నిజామాబాద్ ఉత్తర మండల పరిధిలోని దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు చల్లా ముద్దుకృష్ణ సమర్పించిన"తరగతి గదిలో విజ్ఞానశాస్త్ర ప్రమాణాలను పెంపొందించడానికి వినూత్న బోధన పద్ధతులు" అనే అంశంపై సమర్పించిన థీసిస్ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. తాను తన పేపర్ ప్రెజెంటేషన్ సమర్పించారు. దీనిలో రాష్ట్రవ్యాప్తంగా 165 ప్రాజెక్టుల నుంచి ఎంపికైన ఉత్తమమైన 31లో వీరి అంశం ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి పార్శి అశోక్, జిల్లాసైన్స్ అధికారి కే. గంగాకిషన్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, టీ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

## రెండు బైకులు డి: ఇద్దరికీ తీవ్ర గాయాలు..

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

రెండు బైకులు ఢీకొని ఇద్దరికీ తీవ్ర గాయాలైన ఘటన సోమవారం సాయంత్రం బాన్సువాడ పట్టణంలో చోటుచేసుకుంది. సోమేశ్వర గ్రామానికి చెందిన విట్టల్, బుడిమి గ్రామానికి చెందిన దినేష్ వేర్వేరు బైకులపై వెళ్తున్నారు. పట్టణంలో వీరి బైకులు అదుపుతప్పి ఢీకొన్నాయి. ప్రమాదంలో విట్టల్ తలకు బలమైన గాయాలు కాగా, దినేష్ కాలుకు గాయమైంది. స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్స్ లో బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పేకాట రాయుళ్లను పట్టుకున్న టాస్క్ ఫోర్స్ బృందం

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ క్రైమ్



టాస్క్ ఫోర్స్ బృందం చేపట్టిన దాడిలో పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. నిజామాబాద్ ఇంచార్జ్ పోలీస్ కమిషనర్ సిహెచ్ సింధు శర్మ ఆదేశాను సారం టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ అంజయ్య, స్పెషల్ పార్టీ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వ హించగా నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విఠలేశ్వర నగర్ రైస్ మిల్ పక్కన పలు వురు పేకాట ఆడుతున్నట్లు గుర్తించారు. పేకాట స్థావరంపై దాడి చేయగా అయి దుగురు పేకాట రాయుళ్లను, 3 సెల్ ఫోన్ లను, రూ. 2450 ల నగదును, 3 ద్విచక్ర వాహ నాలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల కోసం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ ఎస్ ఐ కి అప్పగించారు.

## జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం



టైమ్స్ ఆఫ్ వార్త - చింతకాని

చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఆర్ ఝాన్సీ నిన్న అనారోగ్య కారణాలవల్ల మృతి చెందడంతో వారి కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని కుటుంబ సభ్యులలో అర్హతను బట్టి ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని,మట్టి ఖర్చుల నిమిత్తం రూ.20వేలు అందించాలని తెలంగాణ వైద్య, ప్రజా ఆరోగ్య ఉద్యోగుల సంఘం యూనియన్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ కి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారినికి వినతి పత్రం అందించడం జరిగింది. ఈ యూనియన్ అధ్యక్షులు వి కృష్ణారావు ,ప్రధాన కార్యదర్శి సందీప్ జాయింట్ సెక్రెటరీ నిర్మల జ్యోతి, సభ్యులు సరోజినీ దేవి, సైదుల, లలిత కుమారి , సంధ్య రాణి తదితరులు పాల్గొన్నారు.

since 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
సోమవారం,
03-03-2025
4

# సర్వేల్ శ్రీ వటావృక్ష శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

### ఆలయ చైర్మన్ బాలగోని వెంకటేష్ గౌడ్ - అరుణ ఆధ్వర్యంలో

టైమ్స్ ఆఫ్ వార్తా -సంస్థాన్ నారాయణపురం రిపోర్టర్ గజం శ్రవణ్



యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థన్ నారాయణపురం మండల కేంద్రంలోని సర్వేల్ గ్రామ పంచాయతీ పరిధిలో శ్రీ వటావృక్ష స్వయంభు సాలగ్రామ స్వరూప శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక కళ్యాణం మహోత్సవ బ్రహ్మోత్సవాలు జాతర బుధవారం రోజున తేది: 12.03.2025 ఉదయం 10:00 గంటలకు స్వామివారికి పంచామృతం, అభిషేకం రాత్రి 8: 45 ని. లకు స్వామివారి కళ్యాణం మహోత్సవం గురువారం రోజున 13.03.2025 స్వామి వారి ఊరేగింపు తనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి సాలగ్రామ స్వరూప దేవాలయ కమిటీ చైర్మన్ బాలగోని వెంకటేష్ గౌడ్ – అరుణ, తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పగిళ్ల యాదయ్య , ప్రధాన కార్యదర్శి సిద్ధగోని ఈశ్వర్ గౌడ్ , సలహాదారులు భాస్కర్ నర్సింహ్మా గౌడ్, వీరమల్ల నాగేష్ గౌడ్, శ్రీ వోలోజు హనుమంత చారి ,శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గుత్త శేఖర్ రెడ్డి, శ్రీ రామలింగేశ్వర స్వామి మాజీ ఆలయ చైర్మన్లు ఎల్లంకి చంద్రయ్య గౌడ్, మాజీ సర్పంచ్ మానుపాటి సతీష్ కుమార్, శ్రీ నాగేంద్ర ప్రాచీన శివాలయ ఆలయ చైర్మన్ వర్ధం రవి యాదవ్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు షేక్ షబీర్, వెనుముల జగన్ రెడ్డి, శ్రీ నాగేంద్ర ప్రాచీన శివాలయం మాజీ చైర్మన్ వర్ధం నాగార్జున,బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు వీరమల్ల జంగయ్య గౌడ్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు నలపరాజు పద్మ స్వామి, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు వెనుముల శంకర్ రెడ్డి, చిలక రాజు రాజు, గుండె రాజేష్, బాలగోని యాదయ్య, బోయ నర్సింహ్మా, గుత్తా సీతా రాంరెడ్డి, రాచకొండ యాదగిరి చారి, గుండె మల్లేష్, బాలగోని క్రాంతి, సికిలమెట్ల రాజు, బొల్లమల్ల సత్యనారాయణ, పగిళ్ల కృష్ణ, చిలువేరు శివ, పగిల్ల కిష్టయ్య, ఆలయ కమిటీ, వివిధ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీ యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు






టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పిఎం ఎస్ఆర్ఐ) కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల(మోడల్ స్కూల్) విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా శనివారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని వన్ డే కిసాన్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. పర్యటనలో భాగంగా నీటిని నిల్వ చేసే విధానాలను, పొలాలలో నాటు వేయడం, దున్నడం, పండిన పంటను కొయ్యడం, ధాన్యాలు దంచే పరికరాలను, మట్టిలో కుండలు తయారు చేసే నైపుణ్యాలను ప్రత్యక్షంగా సందర్శించి ఆ పనిలో మమేకమయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ మాట్లాడుతూ, విద్యార్థులు ప్రత్యక్ష అనుభవంతో నేర్చుకోవడంతో మరింత జ్ఞానవంతులుగా తయారవుతారని తెలిపారు. క్షేత్ర సందర్శనతో విద్యార్థులకు మెరుగైన జ్ఞానాన్ని అందించడానికి దోహదపడుతుందని, దీనికోసమే ప్రభుత్వ పాఠశాలలు తోడ్పడతాయన్నారు. కర్షకుల గొప్పతనాన్ని, దేశానికి వెన్నుముక అయిన రైతు పడే శ్రమను గుర్తిస్తూ, దేశానికి, మానవాళికి రైతు అవసరం ఎంతైనా ఉందని విద్యార్థులు గ్రహించారని తెలిపారు. క్షేత్ర పర్యటనలో విద్యార్థులు ఆద్యంతం కేరింతలతో, ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని జయప్రదం చేయండి

### ఆలయ పూజారి సతీష్ భవాని



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

పట్టణంలోని పాత బస్టాండ్ బురదగుడం సమీపంలోని దొర గారి తోటలో నిర్మించిన శ్రీశ్రీశ్రీ త్రిశక్తి అష్టలక్ష్మి కామాఖ్య దేవాలయంలో నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాలకు ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం ఆలయ పూజారి సతీష్ భవాని కోరారు. పట్టణ ప్రెస్ క్లబ్ లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పట్టణంలో నూతనంగా నిర్వహించిన కామాఖ్య ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. మహాశివరాత్రి పర్వదినం నుండి ఆరు రోజులపాటు తాంత్రిక సాంప్రదాయంలో పూజా నిర్వహించగా, మరో మూడు రోజులు వైదిక సంప్రదాయంలో పూజలు నిర్వహించి, విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం నుండి వైదిక సాంప్రదాయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలలో పాల్గొనాలని ఆయన కోరారు మార్చి 6న బ్రహ్మ ముహూర్తనా ఆలయంలో యంత్ర ప్రతిష్టాపన, విగ్రహ ప్రతిష్టాపన, ధ్వజస్తంభ స్థాపన, అనంతరం మహా కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి, బలి ప్రధానం అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాలుపంచుకోవడం ఎంతో పుణ్యకార్యమని, మూడు రోజులపాటు అత్యంత వైభవంగా భక్తి ప్రపత్తులతో నిర్వహించనున్న ఈ కార్యక్రమాలకు పట్టణ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కాగలరని కోరారు.

# వర్గీకరణ లో నేతకాని కులానికి న్యాయం చేయండి



టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

నేతకానిలకు రావలిసిన ఎస్సీ రిజర్వేషన్ ఫలాలను మాలలు దోచుకున్నారని, వర్గీకరణ లో నేతకాని కులానికి న్యాయం చేయాలని నేతకాని మహార్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సునార్కర్ రాంబాబు కోరారు. నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ పిలుపుమేరకు ఎస్సీ వర్గీకరణ సవరణలో నేతకాని సమాజానికి గతంలో, నేడు దశాబ్దాలుగా జరుగుతున్న అన్యాయంపై,ఎస్సీ వర్గీకరణలో నేతకాని కులస్తులకు న్యాయం చేయాలని శాంతియుత దీక్ష ద్వారా ప్రభుత్వానికి తెలియపరుస్తూ, జిల్లా అదనపు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు సునార్కర్ రాంబాబు నేతకాని, రాష్ట్ర అధికార ప్రతినిధి మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్ రిటైర్డ్ జస్టిస్ షమీమ్ అక్తర్ ప్రభుత్వానికి తప్పుడు నివేదిక అందజేశారని మండిపడ్డారు. నేతకాని కులస్తులు 18 లక్షల పైనున్న జనాభాని తక్కువ చూపించడం సరైనది కాదని తెలియజేస్తూ నేతకాని ప్రత్యేక గ్రూప్ కేటాయిస్తూ,నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో రోజులుగా ఏజెన్సీ ప్రాంతాలలో నివసిస్తూ పోడు వ్యవసాయం చేస్తున్న నేతకానిలకు భూమిపై హక్కు కల్పిస్తూ పట్టాలు అందించాలి అంతేకాక ఎస్సీ రిజర్వేషన్ 15 నుండి 20 శాతానికి పెంచాలి. దశాబ్దాలుగా అత్యంత వెనుకబడ్డ మాకు 4 శాతం రిజర్వేషన్ కేటాయించాలన్నారు.అత్యంత వెనుకబడ్డ నేతకాని సామాజిక వర్గాన్ని ఎస్సీ సీ గ్రూపులో ఉంచి, అత్యంత అభివృద్ధి చెందిన మాల ఉపకులాలను ఎస్సీ డీ గ్రూప్ ని కేటాయించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కళాలి నరసయ్య,అనపర్తి యువరాజ్,గోమాశ రాజాం,దుర్గం సంతోష్, జాడి గంగాధర్, కొండగొర్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బెడ్డల లక్ష్మి రాజాం,కామెరా అనూష,దుర్గం గౌరీ మణి, కలాలి భీమయ్య లు పాల్గొన్నారు.

# చిన్న గూడూరు మండలంలో అన్ని గ్రామాల చెరువులను ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీళ్లను నింపాలి

- ప్రజా ప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించాలి
- చివరి ఆయకట్ట వరకు నీళ్లు అందిస్తాం అన్న రేవంత్ సర్కార్ వట్టి మాటలేనా.!
- ఇరిగేషన్ ఎస్సీ కి వినతి పత్రం ఇచ్చిన ఎల్ హెచ్ పి ఎస్, జిల్లా అధ్యక్షుడు ఆంగోత్ చందూలాల్, సేవాలాల్ సేన చిన్న గూడూరు మండల అధ్యక్షుడు బాదావత్ సురేష్



టైమ్స్ ఆఫ్ వార్త – మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి

చిన్న గూడూరు మండలంలోని అన్ని గ్రామాల చెరువులను ఎస్సార్ ఎస్పి కాలువ ద్వారా నీళ్లను నింపాలని ఎల్హెచ్పిఎస్ జిల్లా అధ్యక్షుడు ఆంగోత్ చందులాల్, సేవాలాల్ సేన చిన్నగూడూ రు మండల అధ్యక్షుడు బాదావత్ సురేష్ మహబూబాబాద్ జిల్లా ఇరిగేషన్ ఎస్సీ నరసింహారావు కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వినతి పత్రం సమర్పించిన అనంతరం ఆంగోత్ చందూలాల్, బాదావత్ సురేష్లు మాట్లాడుతూ.. చిన్న గూడూరు మండల వ్యాప్తంగా ఎస్సారెస్పీ కాలువ ద్వారా చెరువులను నింపాలని, అతి వర్షాలు వచ్చి చెరువులకు గండ్లు పడటంతో, చెరువులో ఉన్న నీళ్లు కిందికి వెళ్లిపోయి, బావులలో భూగర్భ జలాలు తగ్గిపోయా యన్నారు. రైతులు భూగర్భ జలాలు పడిపోవడంతో, పంటలకు నీళ్లు సరిపోక, చేతికొచ్చిన పంట ఎండిపోయే దశకు చేరుతుందన్నారు. గత ప్రభుత్వంలో చెరువులను నింపి, మత్తడి పోసే విధంగా ఉండటంతో రైతులకు ఏ ఇబ్బంది లేకుండా ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక ఎస్సారెస్పీ కాలువలో నీళ్లు చూద్దామన్నా కూడా కరువైన పరిస్థితి నెలకొని ఉంది. రేవంత్ రెడ్డి సర్కార్ చివరి ఆయకట్టవరకు నీళ్లు అందించి రైతుల పంట పొలాలకు నీళ్లు అందించే బాధ్యతను తీసుకుంటా అన్న రేవంత సర్కార్, నేటికీ నీళ్లు వదలక పోవడం అంటే ప్రజల పట్ల, రైతుల పట్ల ఎంత చిత్తశుద్ధితో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా తక్షణమే స్పందించి రైతులకు నీళ్లు వదిలి వారి యొక్క పంట పొలాలకు నీళ్లు అందించే విధంగా తక్షణమే ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడి స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఎల్ ఎస్ ఓ) మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ బోడ చందులాల్ పాల్గొన్నారు.

# కష్టమాదిగ విజయవంతం చేయాలి

### పగిడిపల్లి రవీంద్ర మాదిగ.



టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని

ఐదవ తారీకు కష్టమాదిగ ఖమ్మం రాబోతున్న కార్యక్రమాన్ని విజయవంతం జిల్లా ప్రధాన కార్యదర్శి పగిడిపల్లి రవీంద్ర మాదిగ,మండల గ్రామ బాధ్యులందరూ వేల సంఖ్యలో డప్పులతో పాల్గొనాలని, కృష్ణ మాదిగ చెప్పినట్టే షమీం అత్తర్ కమిషన్ రిపోర్ట్ లో లోపాలను సవరించి 100 కి 100 శాతం ఏ వర్గానికి అన్యాయం జరగకుండా అన్ని కులాలకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ అందే విధంగా అందరికి న్యాయం జరిగేలా రిజర్వేషన్లు పంపిణీ చేయాలని కోరటం జరిగింది. మండల అధ్యక్షుడుచిర్రా ఉపేందర్ మాదిగ,మండల ఉపాధ్యక్షుడు గద్దల అనిల్, మాదిగ మండల అధికార ప్రతినిధి జొన్నలగడ్డ పుల్లారావు మాదిగ , మండల ప్రచార కమిటీ కుక్కల దిలీప్ మాదిగ ,మరియు గద్దల మహేష్ ,ప్రేమ్ కుమార్ ,నవీన్, అరవింద్ ,ప్రవీణ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# నూతన దంపతులను ఆశీర్వదించిన సమతా సైనిక దళ్, నేతకాని సంఘం నాయకులు



టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారంలో సోమవారం జరిగిన జైపూర్ మాజీ ఎంపీటీసీ రామటెంకి లింగస్వామి వివాహ మహోత్సవ వేడుకలకు సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్, పెద్దపల్లి జిల్లా సమతా సైనిక దళ్ నాయకులు, నేతకాని మహర్ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నూతన దంపతులను అక్షింతలతో ఆశీర్వదించి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ నూతన దంపతులు ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో, పిల్లాపాపలతో, సుఖ సంతోషాలతో ,పది కాలాలపాటు చల్లగా వర్ధిలుస్తూ ఆదర్శవంతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నేతకాని సంఘం నాయకులు కలాలి నరసయ్య, గోమాస రాజం, కలాలి భీమయ్య, గోదారి లింగన్న, జాడి రమేష్, గుమాస శ్రీనివాస్, సమతా సైనిక దళ్ పెద్దపల్లి జిల్లా నాయకులు దుర్గం విశ్వనాథ్, చీమల ఆనంద్, జిమ్మిడి శాంతి కుమార్, గూడూరి లవన్ కుమార్, పెళ్లి కుమారుడి అన్న రామటెంకి తిరుపతి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సహాయం చేయడాన్ని నేర్పాలి




టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

పిల్లలకు తమ చుట్టూ ఉన్నవారికి సహాయం చేయడాన్ని నేర్పాలని తవక్కల్ విద్యాసంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. జిల్లాలోని రామకృష్ణాపూర్ పట్టణంలో తవక్కల్ హైస్కూల్ లో ఆరవ తరగతి చదువుతున్న శ్రీ తీర్థ పుట్టినరోజు సందర్భంగా తవక్కల్ విద్యాసంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు చిన్నారి శ్రీ తీర్థను ఆశీర్వదించారు.అనంతరం ఆర్కే 1,సుభాష్ నగర్ లో గల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తవక్కల్ విద్యాసంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్ చేతుల మీదుగా సోమవారం నోట్ బుక్స్, పెన్నులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.సహాయం చేయడంలో పిల్లలు ఎప్పుడూ ముందుండేలా.. తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. పిల్లలకు ఇలాంటి మంచి అలవాటును నేర్పిస్తే తల్లిదండ్రులకు కూడా సమాజంలో మంచి పేరు వస్తుందన్నారు. సహాయం చేసే గుణం నుంచి ఏర్పడే భావోద్వేగం పిల్లలను మరింత ఉన్నత స్థాయిలో నిలబడేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు కే. శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు జి.రజిత, చిన్నారి శ్రీ తీర్థ తండ్రి రాజలింగు మోతె,సోషల్ ఆక్టివిస్ట్ మహమ్మద్ పాష లు పాల్గొన్నారు.

# గౌరారంలో దూడలకు నట్టల నివారణ



టైమ్స్ ఆఫ్ వార్త, పిట్లం

పిట్ల మండలంలోని గౌరారం గ్రామములో దూడల ప్రదర్శన, పాల ఉత్పత్తి పోటీ శిబిరాన్ని మండల పశు వైద్య అధికారి డాక్టర్ సంతోష్ కుమార్ శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. పశువైదధికారి డాక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ దూడలకి నట్టల మందులు, పాల ఉత్పత్తి పోటీ ఏ గేదెలు అయితే ఎక్కువ పాలు ఇస్తాయో వాటికి బహు మానము ఇవ్వడం జరిగింది మొదటి, రెండవది, మూడవది మూడు బహుమానాలు ఇవ్వడం జరిగింది ఈ యొక్క శిబిరానికి మండల పశువైద్యాధికారి దూడలకు నట్లల మందు వేయడం జరిగింది రైతులకు బహుమానాలు అందజేశారు. ఈ యొక్క శిబిరంలో పశుగణాభివృద్ధి సంస్థ వారు నట్టల మందులు బహుమానాలు అందజేసినారు. ఈ యొక్క శిబిరానికి గోపాలమిత్ర సూపర్వైజర్ తిరుపతి గోపాలమిత్ర సంగమేశ్వర్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

TIMES OF VARTHA (04-03-2025)MADKa_times of varha main (13-2).qxd 3/4/2025 6:34 AM Page 5

since 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
మంగళవారం,
04-03-2025


# చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా పటిష్ట చర్యలు

- రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి
- రాబోయే 10 రోజుల పాటు అధికారులు అప్రమత్తంగా ఉంటూ నీటి సరఫరా పర్యవేక్షించాలి
- ఎత్తిపోతల పథకాలకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా లోటు రాకుండా చర్యలు
- రిజర్వాయర్ ల నుండి విడుదల చేసే నీటిని సమర్థవంతంగా వినియోగించాలి
- యాసంగి సాగు నీటి సరఫరా , గురుకులాల సందర్శన పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సిఎస్





టైమ్స్ ఆఫ్ వార్త - మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి

చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగు నీరు సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి అన్నారు.సోమవారం రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి యాసంగి సాగు నీటి సరఫరా , నీటి పారుదల శాఖ పని తీరు పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. వీరబ్రహ్మాచారి, లతో కలిసి కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు.రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ,యాసంగి పంట సంరక్షణకు రాబోయే పది రోజులు చాలా కీలకమని, అధికారులు అప్రమత్తంగా ఉంటూ సాగు నీరు, విద్యుత్తు సరఫరా అవసరమైన మేర పంట పొలాలకు చేరేలా చూడాలని, వ్యవసాయ శాఖకు నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండాలని సిఎస్ విద్యుత్ అధికారులను ఆదేశించారు.భారీ నీటి పారుదల శాఖ పరిధిలోని రిజర్వాయర్లలో అవసరమైన మేర సాగునీరు అందుబాటులో ఉందని, పంటలకు సమృద్ధిగా నీరు విడుదల చేయడం జరుగుతుందని, విడుదల చేసిన నీరు చివరి ఆయకట్టు వరకు చేరేలా అధికారులు సమర్థవంతమైన పర్యవేక్షణ చేయాలని అన్నారు. ˆాసంగి లో 77 లక్షల ఎకరాలలో సాగు జరుగుతోందని, ముఖ్యంగా వరి పంట 54.82 లక్షల ఎకరాల సాగు జరిగిందని, గత సంవత్సరం కంటే 2 లక్షల 70 వేల ఎకరాలు వరి, లక్ష ఎకరాల మొక్క జొన్న పంట అధికంగా పండుతుందని అన్నారు. సిద్దిపేట, జనగామ, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి, వనపర్తి మొదలగు జిల్లాలో కొన్ని సమస్యలు ఉన్నాయని వీటిని పక్కగా పర్యవేక్షిస్తూ పొలాలు ఎండిపోకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరు రాక పోవడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల కొంత మేరకు రైతులు ఇబ్బందులకు గురి కావడం గమనించామని అన్నారు. ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన ప్రతి నీటి చుక్కను పూర్తిస్థాయిలో విని యోగించు కుంటూ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ కలెక్టర్లకు సూచించారు. ఎస్సారెస్పీ, ఎస్సారెస్పీ స్టేజి 2, నాగార్జున సాగర్, ఏఎంఆర్ లిఫ్ట్ , కల్వకుర్తి , ఇతర ప్రాజెక్టుల కింద నిర్దేశిత పంట పొలాలకు సాగునీరు అందాలని సీఎస్ తెలిపారు. రాబోయే 10 రోజుల్లో క్షేత్రస్థాయి నుంచి వచ్చే డిమాండ్ అనుగుణంగా సాగునీరు విడుదల చేస్తూ రైతుల పొలాలు ఎండిపోకుండా కాపాడాలని సిఎస్ ఆదేశించారు. ఎత్తిపోతల పథకాలకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఎక్కడ లోటు రాకుండా చూసుకోవాలని సీఎస్ డిస్కం అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఉన్న పీక్ డిమాండ్ కు మరో 10 నుంచి 15 శాతం పెరిగినా తట్టుకునేలా విద్యుత్ వ్యవస్థ సన్నద్ధంగా ఉండాలని సీఎస్ పేర్కొన్నారు. సాగు నీరు సరఫరా, పంటల పరిస్థితుల పై పత్రికలలో వచ్చే వ్యతిరేక వార్తలకు ఎప్పటికప్పుడు స్పందించాలని,రైతులు ఆందోళనకు గురికాకుండా సమృద్ధిగా సాగు నీటి సరఫరా అవుతుందని భరోసా కల్పించాలని, క్షేత్రస్థాయిలో వచ్చే చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని అన్నారు.రాబోయే 10 రోజులపాటు వ్యవసాయ శాఖ అధికారులు ఫీల్డ్ లెవెల్ లో రైతులతో సంప్రదింపులు జరుపుతూ ఉండాలని అన్నారు. సాగు నీరు ఏర్పడే జిల్లాలలో మండలాల వారీగా తహసిల్దార్, నీటిపారుదల శాఖ ఇంజనీర్, వ్యవసాయ అధికారితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా పర్యటించాలన్నారు. రాష్ట్రంలో ఉన్న గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కలెక్టర్, అదనపు కలెక్టర్ ల తనిఖీ తర్వాత పరిస్థితులలో మార్పులు వచ్చాయని, పిల్లలకు అందించే ఆహార నాణ్యత పెరిగిందని, కామన్ మెన్యూ డైట్ పక్కాగా అమలు అవుతుందని అన్నారు. సింగిల్ యూసెజ్ ప్లాస్టిక్ నిషేధం సంబంధించి ప్రజలను భాగస్వామ్యం చేస్తూ చర్యలు తీసు కోవాలని సిఎస్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అధికారులతో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, పై విషయాల గురించి సమావేశం నిర్వహించారు, ప్రభుత్వ ఆదేశాల మేరకు గురుకులాలు రెసిడెన్షియల్ పాఠశాలలను రెగ్యులర్ గా చెక్ చేయాలని, జిల్లాలోని ప్రతి మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో సంక్షేమ హాస్టల్స్ లను తనిఖీ చేసేందుకు టాస్క్ ఫోర్స్ తనిఖీలు నిర్వ హించాలన్నారు, ఈ సమావేశంలో ఎలక్ట్రిసిటీ, వ్యవసాయ, ఇరిగేషన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ద్వారా ఆధునిక సాంకేతిక విద్య

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



టైమ్స్ ఆఫ్ వార్త మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

ఆధునిక సాంకేతిక విద్యా ప్రమాణాలను మరింత పెంపొందించి అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా అభ్యర్థులకు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో, మంచిర్యాల పట్టణంలోని ఐ.టి.ఐ. కళాశాల ప్రాంగణంలో కొనసాగుతున్న అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక విద్యా ప్రమాణాలతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా నేటి పోటీ ప్రపంచంలోని సాంకేతికను అభ్యర్థులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా ఆధునిక రంగాల లో అభ్యర్థులకు ఉపయోగపడే విధంగా వివిధ అత్యాధునిక సాంకేతికత కోర్సులను అందించడం జరుగుతుందని, వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ అందించి ఉపాధి పొందేలా అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఐ.టి.ఐ. కళాశాల ప్రిన్సిపల్ రమేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచ వినికిడి దినోత్సవం

### గౌరారం కలాన్ పాఠశాలలో అవగాహన కార్యక్రమం



టైమ్స్ ఆఫ్ వార్త - గాంధారి

గాంధారి మండలంలోని గౌరారం ప్రాథమిక పాఠశాలలో మార్చి 3న ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వినికిడి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.ప్రధానోపాధ్యాయులు రాములు మాట్లాడుతూ, "ప్రతి సంవత్సరం మార్చి 3న ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని జరుపుకుంటాం. పుట్టిన ప్రతి 1000 మంది శిశువులలో 5 గురికి వినికిడి లోపం ఉంటుంది. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి"అని అన్నారు.ప్రత్యేక ఉపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ, "జ్ఞానేంద్రియాలలో చెవి చాలా ముఖ్యమైనది. ఇది శబ్ద రూపంలో సమాచారాన్ని చేరవేస్తుంది. కాబట్టి, చెవిని జాగ్రత్తగా చూసుకోవాలి. 50 డెసిబుల్స్ కంటే ఎక్కువ శబ్దం వింటే చెవిలోని భాగాలు దెబ్బతింటాయి"అని హెచ్చరించారు.మరో ప్రత్యేక ఉపాధ్యాయుడు పెంటయ్య మాట్లాడుతూ, "హెడ్‌ఫోన్స్, డీజేలు ఎక్కువగా వినడం వల్ల వినికిడి సమస్యలు వస్తాయి. దివ్యాంగులకు సహాయం చేయడంలో మనం ముందుండాలి" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాపురావు, నిరోషా, సరిత, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు వినికిడి పరికరాల గురించి, వినికిడి లోపాలను గుర్తించడం గురించి అవగాహన కల్పించారు.

# శ్రీ కోట దుర్గమ్మ ఆలయం వద్ద రుద్ర హెూమం, హనుమాన్ స్వాములకు భిక్ష



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని కోటగల్లి ప్రాంతంలో నూతనంగా కొలువుదీరిన శ్రీ కోట దుర్గమ్మ ఆలయ ప్రాంగణం వద్ద రెండవ వార్షికోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని బాన్సువాడ గాయత్రి ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ సుదర్శన దండి కాశీ స్వామీజీ మహారాజ్ వారి ఆధ్వర్యంలో సోమవారం రుద్ర హెూమం ప్రారంభించారు. 108 కలుశాలతో అమ్మవారికి అభిషేకం చేయించారు. అనంతరం హనుమాన్ దీక్ష మాల ధారణ స్వాములకు అన్నప్రసాద వితరణ దాత గజ్జల రాజ గీతు గోపాల్ (గోపి మెడికల్ యజమాని) వారి ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేశారు. హనుమాన్ స్వాముల దీక్ష మహెూత్సవంలో బాన్సువాడ పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుండి 120 మంది స్వాములు భాగస్వాములై, బిక్షను స్వీకరించి, అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీ కోట దుర్గమ్మ ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు పత్తి శ్రీకాంత్, అధ్యక్షుడు ఉప్పరి లింగం, తోపాటు ప్రతినిధులు బాసం కాశీనాథ్, నరేష్ తోపాటు ఆలయ కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు, అమ్మవారి భక్తులు,పాల్గొన్నారు.

# ఉద్యోగ,ఉపాధ్యాయ సమస్యలపై ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం

### తెలంగాణ మైనారిటీ ఉద్యోగుల సంఘం బాన్సువాడ డివిజన్...




టైమ్స్ ఆఫ్ వార్తు- బాన్సువాడ:

డీఎస్సీ-2024 ద్వారా నూతనంగా ఎంపిక అయిన ఉర్దూ మీడియం ఎస్ జి టి ఉపాధ్యాయయులకు 3 రోజుల శిక్షణ కార్యక్రమం ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాన్సువాడ లో జరుగుతుంది.ఈ సందర్భంగా శిక్షణ కేంద్రాన్ని తెలంగాణ స్టేట్ మైనారిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ (టీఎస్ మీసా) ప్రధాన కార్యదర్శి సయ్యద్ హాజీ, వైస్ ప్రెసిడెంట్ మొహమ్మద్ అక్బర్, కోశాధికారి సయ్యద్ అబ్దుల్ రజాక్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా నియామకమైన ఎస్జీటీలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎలాంటి సమస్య వచ్చిన మైనార్టీ ఉద్యోగుల సంఘాన్ని సంప్రదించాలని ఈ సందర్భంగా కోరారు. అనంతరం టీఎస్ మీసా నూతన సంవత్సర క్యాలండర్లను పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో డీఎస్సీ 2004 ఉర్దూ మీడియం ఎస్ జి టి ఉపాధ్యాయులు, తదితరులు, పాల్గొన్నారు.

# చద్మల్ తాండలో శివాజీ మహారాజ్ చక్రవర్తి భూమి పూజ



టైమ్స్ ఆఫ్ వార్త - గాంధారి

గాంధారి మండలంలోని చద్మల్ తాండ చరిత్రలో ఒక ముఖ్యమైన రోజుగా నిలిచిపోయింది. ఛత్రపతి శివాజీ మహారాజ్ చక్రవర్తి విగ్రహ స్థాపన కోసం ఘనంగా భూమి పూజ జరిగింది. ఈ వేడుకకు మాజీ జెడ్.పి.టి.సి హరలే తానాజీ రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,"శివాజీ మహారాజ్ ధైర్యానికి, తెగువకు, న్యాయానికి ప్రతీక. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని మనమందరం ముందుకు సాగాలి"అని పిలుపునిచ్చారు.ఈ భూమి పూజ కార్యక్రమం చద్మల్ తాండలో నూతన ఉత్సాహాన్ని నింపింది. శివాజీ మహారాజ్ విగ్రహం రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ వేడుకలో పాల్గొన్న వారందరికీ తీపిని పంచిపెట్టారు.ఈ కార్యక్రమం లో తాండ పెద్ద నాయకులు, హనుమాన్ స్వాములు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పని సరి ధరించాలి : ఎస్సై రాజు



టైమ్స్ ఆఫ్ వార్త, పిట్లం

ద్విచక్ర వాహన దారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని పిట్లం ఎస్ఐ రాజు అన్నారు. ఈ సందర్భంగా ఎస్ ఐ ఆదేశాల మేరకు మండలం లొని పోత్రెడ్డిపల్లి వద్ద పోలీసులు వాహనాలను తనికి చేశారు హెల్మెట్ ధరించని వాహన దారులకు జరిమానా విధించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను వెంటపెట్టుకోవాలని, వాహనాలపై ఉన్న పెండింగ్ చల్లాన్ లను చెల్లించాలని సూచించారు ఈ కార్యక్రమం లో సిబ్బంది రవిచంద్ర , నాగరాజు పాల్గోన్నారు.

# శ్రీ కోట దుర్గమ్మ ఆలయాన్ని సందర్శించిన శ్రీ విద్య నృసింహ భారతి మహా స్వామీజీ

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:





బాన్సువాడ రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని శ్రీ కోట దుర్గమ్మ ఆలయం రెండవ వార్షికోత్సవం సందర్భంగా జంట నాగుల ప్రతిష్ట మహెూత్సవాన్ని పురస్కరించుకొని శృంగేరి విరుపక్ష పీఠాధిపతులు, శ్రీ విద్యా నృసింహ భారతి మహా స్వామీజీ అనంతపురం వారు సోమవారం రాత్రి 7 గంటలకు ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. వారి వెంట బాన్సువాడ గాయత్రి ఆశ్రమ పిఠాధిపతులు శ్రీ సుదర్శన దండి కాశీ స్వామీజీ మహారాజ్ తో పాటు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు పత్తి శ్రీకాంత్, అధ్యక్షుడు ఉప్పరి లింగం తో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు, తదితరులు, ఉన్నారు.

# నేరల్ తండాలో మాజీ సర్పంచ్ మనుమరాలి ఘన వివాహం

టైమ్స్ ఆఫ్ వార్త - గాంధారి





గాంధారి మండలంలోని నేరల్ తండాలో మాజీ సర్పంచ్ మంజ బిచ్చం నాయక్ మనుమరాలు సంగీత వివాహం మహేష్ తో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వివాహం నేరల్ తండాలో సాంప్ర దాయబద్ధంగా జరిగింది. పెళ్లికి బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వివాహ వేడుకలో సాంస్కృతిక కార్యక్రమాలు, విందు భోజనాలు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ఎస్.వి.ఎస్. మోటార్స్ యజమాని మంజ రామకృష్ణ దంపతులు, బర్దావల్ ఇందల్ సింగ్, బామన్ సుందర్ బాయ్ మరియు ఇతర ప్రముఖులు హాజరయ్యారు.ఈ వేడుకకు వచ్చిన వారందరికీ మాజీ సర్పంచ్ మంజ బిచ్చం నాయక్, వారి కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామస్తులు అందరూ ఈ వేడుకలో ఉత్సాహం గా పాల్గొన్నారు.

# పెద్దమ్మ తల్లి మొదటి వార్షికోత్సవంలో పాల్గొన్న కాసుల బాలరాజు



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్స్ వాడ నియోజక వర్గం వర్ని మండల లో తగి లేపల్లి గ్రామములో పెద్దమ్మ తల్లి మొదటి వార్షి కోత్స వంలో సోమ వారం పాల్గొన్న తెలంగాణా అగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మెన్ కాసుల బాల్ రాజ్ , మార్కెట్ కమిటీ ఛైర్మెన్ సురేష్ బాబా , నేమాని బుజ్జి ,తదితరులు, పాల్గొన్నారు.

since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
మంగళవారం,
04-03-2025


# రైతులకు సస్యరక్షణ పద్ధతులపై అవగాహన



టైమ్స్ ఆఫ్ వార్త - సదాశివనగర్

సదాశివనగర్ మండలం ధర్మారావుపేట్ గ్రామంలోని రైతులకు కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రైతులు పాటించవలసిన సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతు క్షేత్ర పాఠశాలలో భాగంగా రైతులకు సమగ్ర సస్య రక్షణ కిట్లు అందజేశారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ హొన్నప్ప గౌడ పర్యవేక్షణలో గత ఆరు వారాల నుండి క్షేత్రస్థాయిలో మొక్కజొన్న పంట వేసినప్పటి నుండి పంట చేతికి వచ్చు వరకు పాటించవలసిన అన్ని సస్య రక్షణ పద్ధతులపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట రెడ్డి మాట్లాడుతూ.. పురుగుమందులు వాడేట ప్పుడు పాటించవలసిన జాగ్రత్తల గురించి చాలా విషయాలు చెప్పి (IPM) కిట్ ఉపయోగాలు వివరించారు. హొన్నప్ప గౌడ రైతులకు పురుగు గుడ్లపై వేప నూనె పిచి కారి, రెక్కల పురుగు పై నిఘా పెట్టటానికి లింగాకర్షక బుట్టలు, ట్రైకోగ్రామా గుడ్డు పరాన్న జీవి ఉపయోగం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి ప్రజాపతి, వ్యవసాయ విస్తరణ అధికారి బానోత్ శ్రీనివాస్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

టైమ్స్ ఆఫ్ వార్త - ప్రతినిధి శేర్లింగంపల్లి




జొనల్ వ్యాప్తంగా సోమవారం ప్రజావాణి కార్యక్రమం కొనసాగింది. జోనల్ కార్యాలయం తోపాటు షేర్ లింగంపల్లి ,చందానగర్ ,యూసుఫ్ గూడా ,పటాన్చెరువు సర్కిల్లో అధికారులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కాగా మొత్తం 22 వినతులు అధికారులకు అందాయి .ఇందులో జోనల్ కార్యాలయంలో 3, శేర్లింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో 12, యూసఫ్ గూడ సర్కిల్ కార్యాలయంలో 4 ,చందానగర్ సర్కిల్ కార్యాలయంలో 3 చొప్పున వినతులు వచ్చాయి. ఇందులో పట్టణ ప్రణాళిక, పన్ను విభాగం, ఇంజనీరింగ్ కు సంబంధించి సమస్యలను ప్రజలు వినతిపత్రం రూపంలో అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన వినతులపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు .అత్యంత ప్రాధాన్యతగా భావించి క్షేత్రస్థాయి పరిశీలనలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి తీసుకున్న చర్యలను తిరిగి ప్రజలకు నివేదించాలని జోనల్ కమిషనర్ సూచించారు. చందానగర్ సర్కి కార్యాలయంలో డిసి మోహన్ రెడ్డి ఆయా విభాగాల అధికారులతో ప్రజావాణిలో వినతులను స్వీకరించారు.

## జేఎన్‌టీయూహెచ్‌లో బోధనేతర సిబ్బందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ప్రారంభం..



టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి

జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (జె ఎన్ టి యూ హెచ్ ) "బోధనేతర సిబ్బందికి నైపుణ్యాభివృద్ధి" అనే శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించింది. యూ జి సి –మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మార్చి 3 నుండి మార్చి 6, 2025 వరకు కూకట్పల్లి క్యాంపస్ లో ఈ శిక్షణ కొనసాగనుంది. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి ప్రొఫెసర్ టి. కిషెన్ కుమార్ రెడ్డి (చీఫ్ ప్యాట్రన్), డా. కె. విజయ కుమార్ రెడ్డి, డా. కె. వెంకటేశ్వరరావు (ప్యాట్రన్లు) హాజరయ్యారు. డా. ఎం. సుషమా కన్వీనర్, డా. మెరుగు సురేందర్ కో–ఆర్డినేటరగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూహెచ్ వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ అధికారిక కమ్యూనికేషన్, నోట్ తయారీ (డ్రాఫ్టింగ్), పరిపాలనా నైపుణ్యాల ప్రాముఖ్యతను వివరించారు. అధికారిక పత్రాలు స్పష్టంగా, నిర్దిష్టంగా, సందేహాలకు తావులేని విధంగా రాయడం ఎంత ముఖ్యమో ఆయన వివరించారు. ఇందులో ప్రధానంగా కంప్యూటర్ నైపుణ్యాలు, ఆడిట్ సమాధానాలు, బడ్జెట్ ఖర్చుల నిర్వహణ, కొనుగోలు విధానాలు, (ప్రొక్యూర్‌మెంట్ ప్రాసెస్) సేవా నియమాల అవగాహన, పే ఫిక్సేషన్, పెన్షన్ లెక్కలు, ఆర్టీఐ వంటి పరిపాలనా వ్యవహారాలు ఈ నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం ద్వారా బోధనేతర సిబ్బందికి అవసరమైన నైపుణ్యాలను మెరుగుపరచి, వారి వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంచి, విశ్వవిద్యాలయ పరిపాలనను మరింత సమర్థంగా నిర్వహించడమే లక్ష్యం.

## డివిజి ట్రస్ట్ ద్వారా అంత్యక్రియలకు ఆర్థికసాయం

### యువనేత రామకృష్ణ గౌడ్



టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి

124 ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని జన్మభూమి కాలనీ లో నివసించే నాగిళ్ళ భారతయ్య(68) అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, తనయుడు యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి డివిజి ట్రస్ట్ ద్వారా 5,000/– రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది.

## ఘనంగా బిఆర్ఎస్ యువ నాయకులు నిమ్మల సంతోష్ రావు జన్మదిన వేడుకలు..

### శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే కృష్ణా రావు

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి



బిఆర్ఎస్ యువ నాయకులు నిమ్మల సంతోష్ రావు జన్మదిన వేడుకలను కార్యకర్తలు, అభిమానుల మధ్య సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంతోష్ రావు శాలువా కప్పి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కృష్ణారావు చేతుల మీదగా పారిశుద్ధ కార్మికులు, పేద మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో నిమ్మల సంతోష్ రావు కీలక పాత్ర పోషించి యువతను ప్రోత్సహించారని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ పటిష్టత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, బిఆర్ఎస్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు, మాధవరం రంగారావు, గొట్టుముక్కల పెద్ద భాస్కరరావు, కార్తీక్ రావు స్థానిక నాయకులు సందీప్ ముదిరాజ్, చారి, తదితరులు పాల్గొన్నారు.

## వినయ్‌రెడ్డి చొరవతోనే హాస్టల్‌కు నిధులు మంజూరు

### మండల కాంగ్రెస్ అధ్యక్షులు మంద మహిపాల్

టైమ్స్ ఆఫ్ వార్త - మాక్లూర్



ఆర్మూర్ యోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి చొరువతో ఐలాపూర్ హాస్టల్‌కు నిధుల మంజూరయ్యాయని, నందిపేట్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు మంద మహిపాల్ విలేకర్ల సమావేశంలో అన్నారు. ఆర్మూర్ నియోజవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ వినయ్ కుమార్, ఇలాపూర్ ఎస్ సి హాస్టల్ శిదిలవస్థలో యున్నదని, మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకొని, జిల్లా కలెక్టర్ రాజీగాంధీ హనుమంత్‌కి విన్నవించగా, కలెక్టర్ వచ్చి పరిశీలించారన్నారు. ఆయనద్వారా వినయ్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి కి విన్నవించగా, వినయ్ రెడ్డి చొరువతో 2 కోట్ల 45 లక్షలు నిధులు మంజూరు చేశారనిఅన్నారు.ముఖ్యమంత్రికి, వినయ్ రెడ్డికి మండల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఏదేని అభివృద్ధి సాధించాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమములో మండల అధ్యక్షులు మంద మహిపాల్ తో పాటు,డిసిసి ఉపాధ్యక్షులు ఏ ఎం సి డైరెక్టర్ పెంట ఇంద్రుడు, ఇలాపూర్ సొసైటీ మాజీ అధ్యక్షులు మీసాల లక్ష్మి నారాయణ, ఆర్మూర్ నియోజక వర్గం యువజన అధ్యక్షులు బైడ్ల ప్రశాంత్, డిసిసి డెలిగేట్ దేవిదాస్ గౌడ్, చింరాజ్ పల్లి మాజీ సర్పంచ్ తోట గణేష్, మాజీ ఎంపీటీసి శ్రీనివాస్, మండల మైనార్టీ అధ్యక్షులు యుసూఫ్, ఇలాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజు, మండల కిషన్ కేత్ అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## బోధన్ రూరల్ సీఐపై ప్రజావాణిలో కలెక్టర్‌కు పిర్యాదు..

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి



తనను అకారణంగా కొట్టాడని బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రెంజల్ మండలం దూపల్లి గ్రామానికి చెందిన భోగి భాగ్య సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేసారు.ఈమేరకు గతనెల ఫిబ్రవరి 13న జాన్కంపేట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో తన పర్సు పోవడంతో అక్కడేఉన్న పోలీసులకు ఫిర్యాదు చేశానని అదే సమయంలో బందోబస్తుకు అక్కడే ఉన్న సీఐ విజయ్ బాబు ఆగ్రహంతో లాఠీతో బాదాడని ఆరోపించారు.తనను అకారణంగా కొట్టిన సీఐపై ఎడపల్లి పోలీసు స్టేషన్లో పిర్యాదు చేశానన్నారు.తనకు న్యాయం చేయాలని ఎడపల్లి పోలీస్‌స్టేషన్‌లో, బోధన్ ఏసీపీకి, ఇన్చార్జి సీపీకి విన్నవించినా న్యాయం జరగలేదని ఆమె వాపోయారు.ఇకనైనా ఈ ఘటనపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలని బాధితురాలు కలెక్టర్ తో విన్నవించుకొన్నారు.

## చెరువుల కబ్జాపై ప్రజావాణిలో పిర్యాదు..

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి



ఎడపల్లి మండలంలోని మంగల్ పహాడ్ గ్రామంలో ఉన్న రాయి కుంట,కొత్త కుంట రెండు చెరువులు కబ్జాకు గురయ్యాయని,వాటిలో కబ్జాదారులు యదేచ్ఛగా వ్యవసాయం చేసుకొంటున్నారని, అక్రమంగా చెరువులను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు గ్రామస్తులు పిర్యాదు చేసారు.తమ గ్రామంలోని 70ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ఉన్న రాయికుంట చెరువును, 40ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న కొత్త కుంట చెరువును గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా కబ్జా చేసి యదేచ్ఛగా వ్యవసాయం చేసుకొంటున్నారని,గతంలో ఈచెరువులు గొలుసు కట్టు చెరువులుగా ఉండేవని పిర్యాదులో పేర్కొన్నారు.ఇప్పుడు వాటి ఆనావాళ్ళు కూడా లేవని, గతంలో సైతం చెరువుల కబ్జాపై జిల్లా కలెక్టర్ కు పిర్యాదులు చేశామని తెలిపారు.వీటిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి గ్రామ చెరువులను, భూములను, వీటిపైనే జీవనాదారమైన గూండ్ల కులస్తులను కాపాడాలని కలెక్టర్ ను కోరారు.

## శ్రీరంగంకు అయోధ్య బాల రాముడి ప్రతిమ, తీర్థ ప్రసాదాలు...

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి



టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగంని వారి కార్యాలయంలో బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్ మర్యాదపూర్వకంగా కలిసి ప్రయాగ రాజ్ లోని మహా కుంభ మేళా, అయోధ్య లోని రామమందిరం దర్శనం చేసుకొని తీసుకువచ్చిన బాల రాముడి ప్రతిమ, తీర్థ ప్రసాదాలు సత్యం శ్రీరంగం కి అందజేశారు.ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు తదితరులు పాల్గొన్నారు..

## ఆర్య వైశ్య సంఘం నూతన కార్యాలయంను ప్రారంభించిన జీవిఆర్...



టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి

శేరిలింగంపల్లి నియోజక వర్గం మాదాపూర్ డివిజన్‌లో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆర్య వైశ్య సంఘం నూతన కార్యాలయ గృహ ప్రవేశ కార్యక్రమం లో పాల్గొని సంఘ కార్య వర్గ సభ్యులను సన్మానించిన కూకట్ పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వర రావు (జీవీఆర్ ).

since 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com



# మీనాక్షి నటరాజన్ అందర్నీ సమన్వయ పరుస్తారా?

(మొదటి పేజీ తరువాయి)..



కొనసాగిస్తాయని రాహుల్ అభిప్రాయం. రాహుల్ గాంధీకి అత్యంత సమీపు రాలైన మీనాక్షి నటరాజన్ సాదాసీదా వ్యవహారశైలి తో ఆమె నిర్వహించిన తొలి పార్టీ విస్తృత స్థాయి సమావేశంలోనే రాష్ట్ర అగ్ర నాయకులందరికీ ఆశ్చర్య చకితులను చేసారారని నేతలే అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో మంత్రుల వ్యవహార శైలి, ఎమ్మెల్యేలు ప్రజల తో మమేకమమౌతున్న తీరు, పార్టీ ప్రణాళికలను ప్రజల్లో వారు ఏ మేరకు తీసుకపోతున్నారు?.. సంస్థగతంగా పార్టీని బూత్ స్థాయి నుండి పటిష్టపరిచేందుకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు ఎటువంటి కార్య చరణ ప్రణాళికలను చేపట్టారు, అన్న విషయంపై ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. 23 జూలై 1973 లో జన్మించిన ఆమె ప్రలోభాలకు లొంగని మనస్తత్వం. సింపుల్ సిటీ ఆమె సొంతం. టీం రాహుల్ గాంధీ టు అవేక్ ఏ డిఫరెన్సెస్ అను పేరుపై చేపట్టిన ఉద్యమంలో ముఖ్యమైన సభ్యురాలు. రాహుల్ గాంధీ నమ్మకాన్ని వమ్ముచేయని నాయకురాలు. రైలులో హైదరాబాద్ చేరుకొని రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వాన్ని ఆశ్చర్యపరిచిన మీనాక్షి నటరాజన్. రాష్ట్రంలో పార్టీ లైనుదాటుతు.. తామే రాష్ట్రానికి రారాజుల%శీ%, నియోజకవర్గాలకు తామే సర్వస్వం అంటూ వ్యవహరిస్తున్న మంత్రులను, ఎమ్మెల్యేలను తెలంగాణ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ నటరాజన్ సమయోచితంగా చర్యలు చేపడతారా అన్న విషయంపై పలువురు పల విధాలుగా చర్చించు కోవడం విశేషం. గతంలో ఒక నాయకుడు చెప్పిన విధంగా లిసముద్రంలో ప్రయాణించే పడవకు చిల్లు పడితే పడవలో ప్రయాణించే వారందరూ మునిగిపోతారన్న విషయాలను ప్రతి నాయకుడు గ్రహించాల్సిఉందే? అన్న విషయం రాష్ట్ర నాయకులకు బోధపడటం లేదని ప్రజల భావిస్తున్నారు.రాష్ట్రంలో నియమించబడ్డ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూర్తిస్థాయి లో జిల్లా కమిటీలు వేసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారు. అంతేగాక బూత్ స్థాయి, గ్రామస్థాయి, మండల స్థాయి, జిల్లా స్థాయి లో కమిటీల నియమించకపోవడంతో ఎవరికి వారే రాష్ట్ర నాయకులుగా, జిల్లా నాయకులుగా, ప్రకటించు కుంటూ వ్యవహరించడంతో పార్టీ సీనియర్ నాయకులు ఉదాసీన వైఖరితో వ్యవహరిస్తున్నారు. అంతేగాక కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం బి ఆర్ ఎస్, బి జె పి లలో ఏదో ఒక స్థాయిలో అధికారం చలాయించినవారు, కాంగ్రెస్ పార్టీ పై బురద చల్లిన వారు. కాంగ్రెస్ పార్టీలో చేరి ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో సన్నిహితంగా వ్యవహరిస్తూ పదవులు పొందడంతో 40 సంవత్సరాలుగా పార్టీ జెండా మోసిన కాంగ్రెస్ నాయకులు చిన్న బుచ్చుకుంటున్నారు.అంతే గాక గ్రూపు రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నారన్న ఆరోపణలు కోకకోలాలు. ఈ నేపథ్యంలో అధికారం రాకపూర్వం టిపిసిసి అధ్యక్ష పదవి కోసం పోటీ పడిన అగ్రశ్రేణి నాయకులందరూ, ఒకరికొకరు విమర్శిస్తూ పార్టీ అగ్రనాయకత్వంతో ఆడుకున్న విషయం తెలిసిందే. టిఆర్ఎస్ పార్టీ రెండు పర్యాయాలు అధికారంలో ఉండి వ్యవహరించిన తీరును విసిగి వేసారిన రాష్ట్ర ప్రజలు, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చారు. అనంతరం పార్టీ నాయకత్వాన్ని ప్రశ్నించిన వారే క్యాబినెట్ మంత్రులుగా కొనసాగుతున్నారు.వారందరూ పార్టీ లైన్లో దాటకుండా సమష్టి నిర్ణయాలు తీసుకుంటూ ప్రజల మన్ననలు పొందాల్సి ఉండాలన్న ఆలోచన అటుంచి.. ఎవరికి వారే యమునా తీరే అన్న చందాన టామ్ అండ్ జెర్రీ ముఖ్యమంత్రి స్థాయి అన్నట్లుగా వ్యవహరించడం, అంతర్గతంగా అధికారం కోసం కుమ్ములాటలకు నాంది పలుకుతున్న నేతల వ్యవహార శైలిని ప్రజలు గమనిస్తున్నారన్న విషయాన్ని వారు మరచి వ్యవహరించడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ అన్న పేరిట సాక్షాత్తు పార్టీ అగ్ర నేతలే రేవంత్ రెడ్డి తెలంగాణ టిపిసిసి అధ్యక్ష పదవి అలంకరించిన నాటి నుండి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించేంత వరకు గందరగోళాన్ని సృష్టించడం, ప్రభుత్వ పాలసీలను ఎవరికి వారే ప్రకటించుకుంటూ ప్రజల్లో గందర గోలాన్ని సృష్టించడంతో ప్రజల్లో ఇప్పటికే ప్రభుత్వం పట్ల వ్యతిరేక భావం వచ్చిందన్న విషయాన్ని పార్టీ సీనియర్ నాయకులు మరవడం శోచనీయం.పార్టీ లైన్ దాటి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఏకపక్షంగా వ్యవహరించిన తీరును పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ ఆయన్ను పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ తీసుకున్న నిర్ణయం అభినందనీయమని రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేతలు, ప్రజలు హర్షిస్తున్నారు. గతంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి కోసం జరిగిన హై డ్రామా పోటీసందర్భంగా, మునుగోలు ఎన్నికల సందర్భంగా పార్టీ సీనియర్ నేతలు చేసిన వ్యాఖ్యానాలకు అప్పట్లోనే క్రమశిక్షణ చర్యలు అధిష్టానం తీసుకుని ఉంటే ఇటువంటి పరిస్థితులు దాపురి%శీ%చేవి కావని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల యాదాగిరి గుట్ట లక్ష్మీ నరసింహ స్వామి బంగారు గోపురం ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా వచ్చిన సందర్భంగా, దేవాదాయ శాఖ మంత్రి కానీ, జిల్లా ఇన్చార్జి మంత్రి గాని, యాదాద్రి భువనగిరి జిల్లాలోని, ఆలేరు, భువనగిరి, నకిరేకల్, ఎమ్మెల్యేలు మినహా మిగతావారు ఎవరు హాజరు కాకపోవడంపట్ల పార్టీ అగ్ర నాయకులలో ధిక్కార ధోరణి ముదరక మునుపే అదిస్థానం క్రమశిక్షణ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారండం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఇటీవల ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలు భాగంగా రాహుల్ గాంధీ కలవకుండా ప్రధాని నరేంద్ర మోడితో దిగిన ఫోటోను సొంత పార్టీ నేతలే వివిధరకాల రాజకీయ కామెంట్స్ చేస్తూ వైరల్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వ మంత్రివర్గాలో సీనియర్లు, జూనియర్ల మధ్య అంతర్గత ప్రజాస్వామ్యం పేరిట కుమ్ములాటలు చోటు చేసుకుంటున్న విషయాలను ఎఐసిసి తెలుసుకుంటు%శీ%న్న దన్న విషయాన్ని పార్టీ నేతలు గ్రహించడంలేదు. పార్టీలో, ప్రభుత్వంలో, క్రమశిక్షణ లేకపోతే ప్రభుత్వాన్ని అస్థిరత్వం చేయాలని చూస్తున్న ప్రతిపక్ష పార్టీల వ్యూహాలు ఏ స్థాయికి చేరుకుంటాయి అన్న ఆలోచన నాయకులకు లేకపోవడం గమనార్హం. అంతేగాక చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడం అన్న చందాన ప్రభుత్వానికి కాపాడుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిదా, క్యాబినెట్ మంత్రివర్గంలో సమిష్టిగా నిర్ణయాలు తీసుకునేటట్లు టిపిసిసి అధ్యక్షులు చేపట్టుతున్న చర్లపై ప్రజలు ప్రెస్ చేస్తున్నారు.వారందరినీ సమన్వయం చేసి ఎమ్మెల్యేలను కాపాడుకోవాల్సిన బాధ్యతను తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నాయకత్వానిదే. అలసత్వం వహిస్తే రాహుల్ గాంధీ ఏం చేస్తారు, ఇటీవల రాష్ట్ర పార్టీ ఇన్చార్జిగా నియమితులైన మీనాక్షి నటరాజన్ ఏం చేస్తారని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. అంతేగాక వచ్చే నెలలో జరగాల్సిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో సంఖ్య ఆధారంగా ఒక సీటు బి ఆర్ ఎస్ పార్టీకి పోగా, నాలుగు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను నిర్ణయించాల్సి ఉంటుంది. ఆందుకుగాను ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ లకు చెందిన సుమారు 30 నుండి 40 మంది అభ్యర్థులు ఎమ్మెల్యే కోటా ఎంఎల్ సి పదవి కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. మంత్రివర్గ విస్తరణ, ఎంఎల్ సి అభ్యర్థుల ఎంపిక టిపిసిసికి, ప్రభుత్వానికి శిరోభారంగా మారందం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పార్టీలో అంతర్గతంగా ఆర్ఎస్ఎస్ బిజెపి భావంతో ఉన్న కాంగ్రెస్ స్లీపర్ సెల్ నేతలను గుర్తించి వారిపై కన్నేసి ఉంచకపోతే గాంధీ కుటుంబాన్ని నమ్ముకొని దశాబ్దాల తరబడి కాంగ్రెస్ జెండా మోసిన అసలు సిసలైన పార్టీ నేతలను తగిన స్థాయిలో గౌరవించకపోతే.... రాత్రికి రాత్రి జెండాలు చొక్కలు మార్చి.. గోడ దూకి కాంగ్రెస్ పార్టీలోకివచ్చిన వలసనేతలకు గుర్తించి పక్కనపెట్టి కేవలం కరుడుగట్టిన కాంగ్రెస్ నేతలను గుర్తించి తెలంగాణ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజ ప్రాధాన్యత కల్పిస్తారా లేక బూత్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తారా వేచి చూడాల్సిందే?.

## 5నిమిషాల గ్రేస్ టైమ్

హైదరాబాద్ : రాష్ట్రంలో బుధవారం(మార్చి 5) నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలకు 1,532 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఇంటర్ బోర్డు కా ర్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు ఉదయం 8.45 గంటల వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అయితే ఉదయం 9 తరువాత 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన వారిని కూడా కూడా అనుమతిస్తామని వెల్లడించారు.విద్యార్థులకు 1,2 నిమిషాలు
నుంచి 5 నిమిషాల వరకు గ్రేస్ టైమ్ ఇస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులు పరీక్షా సమయం కంటే ముందే పరీక్షా కేంద్రాలకు వస్తే ఒఎంఆర్ షీట్ ప్రశాంతంగా నింపుకోవచ్చని, హడావుడి ఉండదని, ఒత్తిడి ఉండదని చెప్పారు. అందుకే ఉదయం 8.45 గంటల వరకు విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఇంటర్మీడియేట్ పరీక్షల నేపథ్యంలో ఎగ్జామినేషన్ కంట్రోలర్ జయప్రద భాయి, ఇతర అధికారులతో ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటర్ పరీక్షల ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ పరీక్షలకు మొత్తం 9,96,971 మంది విద్యార్థులు హాజరుకానుండగా, అందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 4,88,448 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4,40,788 మంది ఉన్నారని అన్నారు.
విద్యార్థుల ఫోన్లకు ఎస్ఎంఎస్‌లు : ఇంటర్ వార్షిక పరీక్షల హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ కోసం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. దాంతోపాటు విద్యార్థుల ఫోన్లకే ఇంటర్మీడియేట్ హాల్ టికెట్లు పంపించినట్లు తెలిపారు. విద్యార్థులు ఎస్ఎంఎస్ లింకుపై క్లిక్ చేసి విద్యార్థులు హాల్ టికెట్ నెంబర్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అన్నారు.
31 స్క్రీన్లతో పరీక్షా కేంద్రాల పర్యవేక్షణ : ఇంటర్మీడియేట్ పరీక్షలు నిర్వహణలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకూ తావులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని కృష్ణ ఆదిత్య తెలిపారు. ప్రశ్నపత్రం కూర్పు మొదలు కొని, పరీక్ష కేంద్రాల ఇన్విజిలేటర్ల వరకూ జాగ్రత్తలు పాటించామన్నారు. ప్రతీ పరీక్షా కేంద్రాలలో 5 నుంచి 6 సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ ద్వారా పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. కమాండ్ కంట్రోల్‌లో 31 స్క్రీన్లతో పరీక్షా కేంద్రాలు పర్యవేక్షించేలా ఏర్పాటు చేశామని, ఇందుకోసం 75 మంది సిబ్బంది పనిచేస్తున్నారని అన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్(బిఆన్ఎస్ 163) అమలులో ఉంటుందని తెలిపారు. ఇంటర్ పరీక్షల కోసం 1532 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, 1532 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 29,992 మంది ఇన్విజిలేటర్లను, 124 సిట్టింగ్ స్క్వాడ్లు, 72 ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌ను రంగంలోకి నియమించినట్లు సెక్రటరీ వెల్లడించారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, ప్రిటెండ్ మెటీరియల్స్‌ను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి ఉండదని చెప్పారు. విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లు, సిబ్బందికి కూడా సెల్‌ఫోన్ అనుమతి ఉండదని అన్నారు. విద్యార్థులు ఎవరైనా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు : ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థుల కోసం ప్రత్యేక ఆర్‌టిసి బస్సులు నడుపనున్నట్లు కృష్ణ ఆదిత్య పేర్కొన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద ప్రాథమిక వైద్య సదుపాయాలు, ఒక నర్సు, ఒక ఆశా వర్కర్‌ను అందుబాటులో ఉంచేలా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.–

### విద్యార్థుల కోసం టోల్ ఫ్రీ నెంబర్

మానసిక సమస్యలు, పరీక్షల ఒత్తిడితో ఇతర సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థులకు కోసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఏమైనా సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థులు 9240205555 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. హాల్ టికెట్, ఇతర సమస్యలతో పాటు మానసిక నిపుణులు, ఆరోగ్య సంక్షేమ శాఖ విభాగానికి చెందిన నిపుణులు అవసరమైన కౌన్సిలింగ్ అందిస్తారని తెలిపారు.

## 14 మంది మావోల లొంగుబాటు



నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన 14 మంది సభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఎదుట సోమవారం లొంగిపోయారు. హేమచంద్రాపురంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జిల్లా ఎస్పి రోహిత్‌రాజు మాట్లాడుతూ%ూ% లొంగిపోయిన వారంతా చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాకు చెందిన మావోయిస్టులని అన్నారు. పోలీసులు, 81 బెటాలియన్, 141 బెటాలియన్ సిఆర్‌పిఎఫ్ అధికారులు ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ఆపరేషన్ చేయూత కార్యక్రమం ద్వారా లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకొని తాము కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత జీవితం గడపాలని నిర్ణయించుకొని వారంతా లొంగిపోయినట్లు చెప్పారు. మడివి బీమా, సోడి ఉంగా, మడివి అడుమ, కుంజాం కోసా, కోవాసి నంద, మడివి బీమా, మడివి మాసా, కుంజాం లక్ష్మా, వెట్టి లక్కే, మడివి చుక్కయ్య, వెట్టి కోసా, బీమా, సోడి రాధికా, కుహ్రామి కాజల్ లొంగిపోయినవారిలో ఉన్నారని అన్నారు. గడిచిన రెండు నెలల కాలంలో 44 మంది మావోయిస్టులు లొంగిపోయారని అన్నారు. గత కొంతకాలంగా నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ ఆదివాసీ ప్రజలలో ఆదరణ, నమ్మకం కోల్పోయి కాలం చెల్లిన సిద్ధాంతాలతో పాటు, బలవంతపు వసూళ్లే లక్షంగా పనిచేస్తూ, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అన్నారు. ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందితే తమకు మనుగడ ఉండదని భావించి అమాయకపు ఆదివాసీ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే విషయాలను గ్రహించి తాజాగా 14 మంది మావోయిస్టు సభ్యులు ఆ పార్టీని వీడి లొంగిపోయారని తెలిపారు.

## ఓల్డ్ బోయిన్ పల్లిలో సిసి కెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణా రావు

టైమ్స్ ఆఫ్ వార్త – కూకట్ పల్లి



కూకట్ పల్లి కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఆధ్వర్యములో ఓల్డ్ బోయినపల్లి డివిజన్ లోని అంజయ్య నగర్ కమ్యూనిటీ హాల్ లో సిసి కెమెరాలు ప్రారంభోత్సవం చేసారు. అనంతరం హెచ్ ఎఎల్ పార్క్ పరిశీలించి స్థానిక ప్రజలు నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు , అధికారులతో ఎమ్మెల్యే కృష్ణా రావు మాట్లాడుతూ పార్క్ లో ఉన్న పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు ఎఈ గోవర్ధన్ గౌడ్ , ఏ ఈ ఆశ, వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ, సీనియర్ నాయకులు నరేందర్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు ఇర్ఫాన్ బాయ్ , జనరల్ సెక్రెటరీ మేకల హరినాథ్, మక్కల నర్సింగ్ రావు, హెచ్ ఈ ఎల్ కాలనీ కమిటీ సభ్యులు, అంజయ్య నగర్ వాసులు బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

## టీచర్స్ ఎంఎల్‌సిలుగా శ్రీపాల్, కొమురయ్య విజయం

(మొదటి పేజీ తరువాయి)..



ప్రక్రియ రాత్రి 9 గంటలకు ముగిసింది. మొత్తం 25 కౌంటింగ్ నిర్వహించారు. అదేవిధంగా కరీంనగర్ –మెదక్ –నిజామాబాద్ –ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా మల్క కొమురయ్య విజయం సాధించారు. కరీంనగర్‌లోని అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ జరిగింది. ఈ నియోజకవర్గంలో 25,106 మంది ఓటు వేయగా బిజెపి మద్దతున్న కొమురయ్యకు 12,959 ఓట్లు వచ్చాయి. మరోవైపు కరీంనగర్ –మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం కౌంటింగ్ కొనసాగుతోంది. మంగళవారం వరకు ఫలితం రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

## ప్రజా సేవ కొరకే మారియా ఆశ ఫౌండేషన్.



టైమ్స్ ఆఫ్ వార్త – నాగారం

ప్రజా సేవ కొరకే మరియా ఆశా ఫౌండేషన్ స్థాపించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు పేరాల ప్రవీణ్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పేరాల సునీత శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో పదిహేను మంది డప్పు కళాకారులకు పదివేల విలువచేసే డప్పులను మరియా ఆశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ గ్రామంలో ఆశా కార్యకర్తగా పనిచేసి గ్రామంలో సేవలందించి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన పేరాల మరియమ్మ జ్ఞాపకార్థంగా మరియా ఆశ ఫౌండేషన్ స్థాపించినట్లు ఆయన తెలిపారు. ప్రజాసేవే ఊపిరిగా జీవించిన ఆమె ఆశయ సాధన కోసమే ఫౌండేషన్ కృషి చేస్తుందని అన్నారు. ప్రజాసేవ చేసేందుకు మరియా ఫౌండేషన్ ఎల్లప్పుడు ముందు వరుసలో ఉంటుందని అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మునుముందు అనేక సేవా కార్యక్రమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరాల ఈశ్వర్ రాష్ట్ర కోశాధికారి పేరాల వీరేష్ మరియు డప్పు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి వాటాలు తేల్చండి

(మొదటి పేజీ తరువాయి)..



పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 2022లోనే డీపీఆర్ సమర్పించినా అనుమతుల్లో ఆలస్యం చేస్తున్నారని తెలియజేశారు. అదే సమయంలో న్యాయస్థానాల పరిధిలో ఉన్న అప్పర్ భద్రకు మాత్రం అనుమతులు ఇచ్చారన్నారు. గోదావరిపై తాము చేపట్టిన సీతారామ ఎత్తిపోతల, సమ్మక్క సాగర్ బ్యారేజీలకు మాత్రం అనుమతులు ఇవ్వలేదన్నారు. ఈ మూడు ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), సాంకేతిక సలహా మండలి (టీఏసీ) నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

## మార్చి చివరి వారంలో చిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు

ఈనెల చివరి వారంలో బిల్లులు చెల్లించేలా చూస్తామని హామీనిచ్చారు. అయితే పెండింగ్ బిల్లులు రావడంలేదన్న కారణంగా ప్రస్తుతం నడుస్తున్న పనుల్లో జాప్యం ఉండకూడదని మంత్రి సూచించారు. ప్రజలకు రహదారులే ప్రాథమిక అవసరమని, కాంట్రాక్టర్లు ఈ విషయాన్ని మరవకూడదని, దానిని దృష్టిలో ఉంచుకుని పనులు చేయాలన్నారు.

**PRINTED, PUBLISHED & OWNED BY** MANKALA DASU, H.NO, 3-8-289, Road No. 2 SURYODAYA COLONY , LB NAGAR, HYDERABAD-36. PRINTED AT y.v. reddy, binding works, h.no.5-20, shivani hotel line, gurga nagar, Hyderabad-36, Telangana.Editor MANKALA DASU, RNI NO. **APTEL/2007/22828** CELL: 9705506999